ఈనాడు
మహబూబాబాద్

గురువారం 17 ఆగస్టు 2017 | 16 పేజీలు



జనరేటర్లు 3 (350 కేవీ)

యూపీఎస్‌లు 3 (15కేవీ)

ట్రాన్స్‌ఫార్మర్లు 3 (950కేవీ)

ఫ్యాన్లు 600

ఏసీలు 200

ట్యూబ్‌లైట్లు 2000

వార్డులు 30

చికిత్స పొందుతున్న రోగులు 1000

కరెంటు పోతే కన్నీళ్లే!

ఎంజీఎం ఆసుపత్రి 1000 పడకలతో విరాజిల్లుతోంది.. ఉత్తర తెలంగాణలోని ఆపన్నులను అక్కున చేర్చుకొంటోంది.. నేను న్నానంటూ చేయూత నిస్తోంది... నిత్యం వేలాది మందికి చికిత్స అందిస్తోంది.. ఎందరో ప్రాణాలను రక్షిస్తోంది.. ఇంత ఘనత ఉన్న ఈ దవాఖానాలో కరెంటు పోతే చిమ్మ చీకట్లే.. ఫ్యాన్లు తిరక్క రోగులు వెతలు అనుభవిస్తున్నారు.. ఒక వార్డులోనే కాదు.. అన్ని చోట్లా ఇదే పరిస్థితి. కొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాల్లోనూ కష్టాలు తప్పట్లేదు. రెండో శనివారాలైతే ఉదయం నుంచి సాయంత్రం వరకు నరకమే..

ఈనాడు, వరంగల్, ఎంజీఎం, ఆసుపత్రి, న్యూస్‌టుడే

ఎంజీఎం ఆసుపత్రిలో రోగుల అవస్థలు

సరిపోని జనరేటర్లు

వివరాలు 2లో..



నేటి నుంచి మీజిల్స్, రూబెల్లా కార్యక్రమం

ఏర్పాట్లు చేసిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

టీకాకు వేళాయె!

తొర్రూరుటౌన్, న్యూస్‌టుడే

మీజిల్స్ (తట్టు), రుబెల్లా టీకా వేయడానికి వైద్య ఆరోగ్య శాఖ సిద్ధమైంది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గురువారం నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. సెప్టెంబరు 25 వరకు ఇది కొనసాగనుంది.

ఎక్కడ వేస్తారు?: పల్స్‌పోలియో మాదిరిగా ఇంటింటికి తిరిగి వేయరు. ముందుగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు వారికి వేస్తారు. మిగిలిపోయిన చిన్నారులకు సంచార కేంద్రాలలో టీకాను అందిస్తారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

అత్యవసర బృందాలు: టీకా వేసిన తర్వాత ఎవరికైనా అది పడకపోతే అత్యవసర వైద్యం అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏఎన్‌ఎంలకు ఎమర్జెన్సీ (మిగతా 2లో)

ఏ జిల్లాలో ఎంత మందికి?	
వరంగల్ అర్బన్	2,67,800
వరంగల్ రూరల్	1,51,172
జనగామ	1,29,000
మహబూబాబాద్	1,79,000
జయశంకర్	1,61,305



ప్రశ్నలేసి..లెక్కలు చేయించి!

గంగారంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను బుధవారం కలెక్టర్ ప్రీతిమీన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులతో నల్లబోర్డుపై లెక్కలు చేయించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

వివరాలు.. 7లో

వంద శాతం సాధిద్దాం



వరంగల్ అర్బన్, రూరల్, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ జిల్లాలను వంద శాతం గుడుంబా రహితంగా మార్చడానికి ఎక్సైజ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ చెప్పారు.

వివరాలు.. 3లో

పంచాయతీ భవనాలు పూర్తయ్యేదెన్నడో... 7లో..

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు 15లో..

అధికారులపై జిల్లా పాలనాధికారి ఆగ్రహం

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు మండలంలోని బొద్దుగొండ చెరువులు, కుంటల విస్తీర్ణంపై డిప్యూటీ తహసీల్దార్ సంపత్‌కుమార్ ఇచ్చిన పత్రంపై జిల్లా పాలనాధికారి ప్రీతిమీన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం జిల్లా పాలనాధికారి ప్రీతిమీన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈనెల 2న ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తహసీల్దార్ కుర్చీలో కూర్చొని వివాదాస్పదమైన విషయమై తహసీల్దార్ రాజును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కుర్చీలో కూర్చున్న విషయం ఎందుకు తనకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. తాను నేలవంచ గ్రామంలో రోడ్డు విషయంలో గ్రామసభ నిర్వహించగా కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ సంపత్ ఉన్నారని తహసీల్దార్ రాజు కలెక్టర్‌కు వివరించారు. ఈనెల 2న సాయంత్రం కార్యాలయం చేరుకున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్ హడావుడిగా కుర్చీలో కూర్చొని బొద్దుగొండలో ముదిరాజ్ సొసైటీ కోసం 9 చెరువులు, కుంటలకు 82 ఎకరాల ఆయకట్టు ఉండగా 130 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు బలవంతంగా పత్రాలు రాయించుకొని తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ ప్రీతిమీన ఎమ్మెల్యే బలవంతంగా ఆయకట్టు పత్రం తీసుకెళ్లినట్లు తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని, వెంటనే డిప్యూటీ తహసీల్దార్ ఇచ్చిన ఆయకట్టు సొసైటీ పత్రాన్ని రద్దుచేయాలని ఆదేశించారు.

కేసముద్రం మార్కెట్ ధరలు

కేసముద్రం, న్యూస్‌టుడే: మార్కెట్‌లో బుధవారం వివిధ సరకులకు లభించిన గిరష్ఠ, కనిష్ఠ ధరలు(క్వింటాల్‌కు) రూపాయల్లో ఇలా ఉన్నాయి.. సాంబమసూరి(పా) 2418 - 2187, వెయ్యిపది 1350 -1257, ఆర్ఎన్ఆర్ 2001-1927, బీపీటీ 1708- 1617, పెసర్లు 4300, 3902, కందులు 4200- 4041, బొబ్బెర్లు 3850, 3850, పత్తి 5250- 4100, పసుపు(కా) 7310- 6901, పసుపు(గో) 6901- 6671.

టీకాకు వేళాయె!

(మొదటిపేజీ తరువాయి)

కిట్లు అందించారు. ప్రత్యేక వైద్య బృందాలను నియమించి వాహనాలను సమకూర్చారు. అత్యవసర మందులు, ఆక్సిజన్ అందుబాటులో ఉంచుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర పరిశీలకుల రాక

మీజిల్స్, రూబెల్లా టీకా అమలు నేపథ్యంలో వరంగల్ అర్బన్ జిల్లాకు డాక్టర్ సుకృతారెడ్డి, వరంగల్ రూరల్, మహబూబాబాద్ జిల్లాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జనార్దన్, జనగామ జిల్లాకు డాక్టర్ మహేందర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు డాక్టర్ జ్యోత్స్న, యునిసెఫ్ నుంచి సాజిద్‌అలీ పరిశీలకులుగా నియమితులయ్యారు. త్వరలో ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన బృందం రానుంది. అందరూ ఆకస్మిక తనిఖీలు చేసి టీకా అమలును పరిశీలించనున్నారు.

ఏర్పాట్లు ఇలా..

జిల్లాలో 11 పీహెచ్‌సీలు, 12 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పిల్లలకు టీకాను ఇస్తారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ ఆధ్వర్యంలో డీఐవో డాక్టర్ శ్యామనీరజ ఏర్పాట్లు చేస్తున్నారు.

వరంగల్ రూరల్ జిల్లాలో..

జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పిల్లలందరికీ టీకాను అందజేస్తారు. 1167 మంది సిబ్బంది భాగస్వాములవుతున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అశోక్ ఆనంద్ ఆధ్వర్యంలో డీఐవో డాక్టర్ రాంమనోహర్‌రావు నిర్వహణ బాధ్యతలను చేపట్టారు.

జనగామ జిల్లాలో..

జిల్లాలోని 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పిల్లలకు టీకాను వేస్తారు. 178 మంది ఏఎన్ఎంలు, 686 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 608 మంది ఆశకార్యకర్తలు పాలుపంచుకొంటున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పర్యవేక్షిస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో...

జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పిల్లలందరికీ టీకాను అందించడానికి ఏర్పాట్లు చేశారు. 1437 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 935 మంది ఆశలు, 275 మంది ఏఎన్ఎంలు అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, కార్యక్రమ అధికారులు, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరాం పర్యవేక్షిస్తున్నారు.

జయశంకర్ జిల్లాలో..

జిల్లాలోని 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 179 ఉప ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పిల్లలకు టీకా ఇవ్వడానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఏర్పాట్లు చేశారు. ఇందుకు గాను 918 మంది ఆశవర్కర్లు, 273 మంది ఏఎన్ఎంలు, 1158 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 34 మంది వైద్యాధికారులు, 77 మంది సూపర్‌వైజర్లు, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులను నియమించారు.

ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు పట్టివేత

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల చోరీకి పాల్పడిన వారిని అరెస్టు చేసి 16,500 డిటోనేటర్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తిరుమలగిరి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ సునీతామోహన్ నిందితుల వివరాలను వెల్లడించారు. అప్పులు తీర్చడం కోసం మహబూబాబాద్‌కు చెందిన మహ్మమద్ యాకూబ్‌పాష, అతని బంధువులైన మహ్మమద్ గఫార్, మహ్మమద్ అన్వర్‌లు కలిసి ఈనెల 9న అర్ధరాత్రి తిరుమలగిరి మండలం నందాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఈదులపర్రెతండా సమీపంలోన్న శ్రీ వెంకటేశ్వర ఎంటర్ ప్రైజెస్ (ఎక్స్‌ప్లోజివ్స్) గోదాం వద్దకు డిటోనేటర్ల దొంగతనానికి వచ్చారు. గోదాం కాపాల ఉన్న బైరం వెంకన్నను బెదిరించి గడ్డపారతో తాళం ధ్వంసం చేసి 11 డిటోనేటర్ల బాక్సులు (16,,500 డిటోనేటర్లు) కారులో తీసుకుని పారిపోయారు. తిరుమలగిరి మండలం తొండ శివారులో రైస్‌మిల్లు వెనకాల చెట్లల్లో కారును వదిలివెళ్లారు. డిటోనేటర్ల దొంగతనంపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బుధవారం కారును తీసుకెళ్లేందుకు మహ్మమద్ యాకూబ్‌పాష, మహ్మమద్ గఫార్ వచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించి పూర్తిస్థాయిలో విచారించగా డిటోనేటర్లను చోరీ చేసిన విషయాన్ని అంగీకరించారు. వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న మహ్మమద్ అన్వర్‌ను త్వరలో పట్టుకుంటామని చెప్పారు. గతంలో వీరిపై మహబూబాబాద్, బయ్యారం, నెల్లికుదురు, కురవి పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదైనట్లు తెలిపారు.

స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవమే..!

ఆరు పదవులకు ఆరు నామినేషన్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ పదవులకు నామినేషన్ల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. మొత్తం ఆరు పదవులకు ఆరుగురే పోటీలో నిలిచారు. కార్పొరేటర్లు బయ్య స్వామి, వీరగంటి రవీందర్, నల్ల స్వరూపారాణి, యేలుగం లీలావతి, రాజు నాయక్, జక్కుల వెంకటేశ్వర్లు నామినేషన్లు దాఖాలు చేశారు. కౌన్సిల్ కార్యదర్శి బ్రహ్మయ్యకు వీరు నామినేషన్లను అందించారు. దీంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ విషయాన్ని శనివారం సాయంత్రం అధికారికంగా ప్రకటించనున్నారు.

స్టాండింగ్ కమిటీ పదవుల కోసం బుధవారం ఉదయం గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో తెరాస కార్పొరేటర్లతో మేయర్ నరేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అధిష్ఠానం నుంచి పంపించిన సీల్డ్ కవర్‌లో పేర్లను మేయర్ నరేందర్ చదివి వినిపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి 47వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణిని 27వ డివిజన్ కార్పొరేటర్, స్థాయీ సంఘం సభ్యుడు వద్దిరాజు గణేశ్ బలపర్చారు. 42వ డివిజన్ కార్పొరేటర్ వీరగంటి రవీందర్‌ని 40వ డివిజన్ కార్పొరేటర్ మిరియల్‌కార్ దేవేందర్ ప్రతిపాదించారు. తూర్పు నియోజకవర్గం నుంచి 14వ డివిజన్ కార్పొరేటర్ బయ్య స్వామిని 20వ డివిజన్ ఎంబాడి రవీందర్ బలపర్చారు. 28వ డివిజన్ కార్పొరేటర్ యేలుగం లీలావతిని 7వ డివిజన్ కార్పొరేటర్ కేడల పద్మ ప్రతిపాదించగా వారు నామినేషన్ దాఖాలు చేశారు. వర్ధన్నపేట నియోజవర్గం నుంచి 54వ డివిజన్ కార్పొరేటర్ గుగులోతు రాజునాయక్‌ను 8వ డివిజన్ కార్పొరేటర్ దామోదర్ యాదవ్, 54వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లును 29వ డివిజన్ కార్పొరేటర్ కావేటి కవిత బలపర్చడంతో వారు నామినేషన్లు వేశారు. మేయర్ నరేందర్, ఉప మేయర్ సిరాజుద్దీన్‌తో కలిసి గ్రేటర్ కార్పొరేషన్ కౌన్సిల్ కార్యదర్శి బ్రహ్మయ్యకు నామినేషన్ పత్రాలు అందించారు.

చివరి వరకూ ఉత్కంఠ..: ఆరు పదవులను 15 మంది కార్పొరేటర్లు ఆశించారు. మంగళవారం రాత్రి హన్మకొండలో తెరాస ప్రజాప్రతినిధులంతా సమావేశమయ్యారు. వరంగల్ తూర్పుకు రెండు, పశ్చిమకు రెండు, వర్ధన్నపేటకు రెండు పదవులు కేటాయించేలా ఒప్పందం చేసుకున్నారు. ఈసారి పరకాల నియోజకవర్గానికి పదవిని కేటాయించలేదు. వచ్చేసారి ఇస్తామని సర్దిచెప్పుకున్నారు. అభ్యర్థులను ఎంపికచేసే బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించారు. వారు సూచించిన పేర్లను ఖరారుచేశారు. బుధవారం నామినేషన్ల దాఖలకు చివరి రోజు కావడంతో అనేక ఉత్కంఠతల మధ్య అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. అయితే పదవులు దక్కని కొంతమంది కార్పొరేటర్లు నిరసన గళం విప్పారు. కొందరు తిరుగుబాటు చేసేందుకు చివరి వరకు ప్రయత్నాలు చేశారు. నామినేషన్ల దాఖలు చేసే గడువు ముగిసే వరకు మేయర్, ఉప మేయర్లు బల్దియా కార్యాలయంలోనే మకాం వేశారు. అసంతృప్త కార్పొరేటర్లను అన్ని విధాలా బుజ్జగించారు. వచ్చే ఏడాదిలో పదవులు ఇస్తామని వారికి నచ్చచెప్పడంతో ఎట్టకేలకు వివాదం సద్దుమణిగింది.

కరెంటు పోతే కన్నీళ్లే!

(మొదటిపేజీ తరువాయి)

ఎంజీఎం వైద్యశాలలో కరెంటు బాధలు రోగుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక్కడ రెండు భారీ జనరేటర్లు ఉన్నాయి. కొన్ని విభాగాలకు ఇన్వర్టర్లను ఏర్పాటు చేశారు. కోతలప్పుడు అత్యవసర (ఐసీయూ, ఆర్ఐసీయూ), ఆపరేషన్ థియేటర్, పిల్లల విభాగం, మరికొన్ని ముఖ్యమైన విభాగాలకు మాత్రమే విద్యుత్తును సరఫరా చేయగలుగుతున్నాయి. ఆసుపత్రి మొత్తానికి ఇచ్చే సామర్థ్యం లేదు. ఇటీవల కాలంలో మరమ్మతులు, ఇతర కారణాలతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సమస్య ఇంకా ఎక్కువైంది. క్యాజువాల్టీ, జనరల్, ఇతర వార్డుల్లోని వారు నానా పాట్లు పడుతున్నారు.



ఎంజీఎం ఆసుపత్రిలోని జనరేటర్

'ఓపి'క నశిస్తోంది..

ఔట్ పేషెంట్లనూ విద్యుత్తు కష్టాలు వెంటాడుతున్నాయి. ఇతర జిల్లాలు, సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తారు. ఒక్కో విభాగంలో కనీసం నాలుగైదు వందల మంది ఉంటారు. వీరంతా భారీ కూలైన్లలో నిల్చొంటారు. ఈ సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోతే వైద్యులు బయటకు వెళ్తారు. రోగులు మాత్రం కష్టాలు పడాల్సిందే. బుధవారం ఓపీలో ఉన్న ఒక వృద్ధుడితో 'ఈనాడు' మాట్లాడగా 'నేను పరకాల నుంచి వచ్చాను. విద్యుత్తు లేక డాక్టర్లు వెళ్లిపోయారు. పేదరికం వల్ల ప్రైవేటులో వైద్యం చేయించుకోక ఇక్కడికొస్తే అవస్థలు ఎదురవుతున్నాయి. రూ. వంద బస్సు ఛార్జీలు అయ్యాయి. మళ్లీ రావాడం నావల్ల కాదు' అని వాపోయారు. జ్వరంతో బాధపడుతూ జనరల్ వార్డులో ఉన్న ఒక మహిళను పలకరించగా.. తాను జయశంకర్ జిల్లా ములుగులో ఉంటానని, కూతురును చూడ్డానికి హన్మకొండకు రాగా, తీవ్ర జ్వరం వచ్చిందని, దాంతో ఎంజీఎం ఆసుపత్రిలో శుక్రవారం చేరానని చెప్పారు. శనివారం ఉదయం నాలుగు గంటలు విద్యుత్తు లేకపోవడంతో నర్సులు కూడా రాలేదని అన్నారు. బుధవారం కొద్దిసేపు చీకట్లో ఉండాల్సి వచ్చిందని బాధ వెళ్లగక్కారు.

కొత్త జనరేటర్ల కోసం ప్రతిపాదనలు పంపాం

–డాక్టర్ రమేశ్, పర్యవేక్షకుడు, ఎంజీఎం ఆసుపత్రి

ప్రస్తుతం మా వద్ద ఉన్న జనరేటర్లతో అత్యవసర విభాగాలకు విద్యుత్తును అందిస్తున్నాం. కొన్నిచోట్ల మాత్రం అప్పుడప్పుడు ఉండడం లేదు. కొత్త జనరేటర్ల కోసం ప్రతిపాదనలు పంపాం. అవి వచ్చాక పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తాం.

ఒకే ఒక్కడు

6000 కుటుంబాలకు ఆయనే దిక్కు

అవస్థ పడుతున్న ఆర్టీసీ కార్మికులు

పట్టించుకోని యాజమాన్యం


వైద్యుడి కోసం పడిగాపులుగాస్తున్న కార్మికులు

జులైవాడ, న్యూస్‌టుడే: వరంగల్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 6000 మంది కార్మికుల కుటుంబాలకు వైద్య పరీక్షలు చేయడానికి ఒకే వైద్యుడు ఉండటంతో వైద్యసేవలు అందక ఆర్టీసీ కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రాథమిక వైద్య సేవలందించడానికి ఆర్టీసీ యాజమాన్యం హన్మకొండ-1 డిపోలో డిస్పెన్సరీ (ఆసుపత్రి)ని ఏర్పాటు చేసింది. మొదట ఒక్కే వైద్యాధికారి ఉండగా తాత్కాలిక పద్ధతిలో మరో మహిళా వైద్యాధికారిని నియమించారు. కానీ ఆమె సెలవులో వెళ్లడంతో ఇక మిగిలిన ఒక్క వైద్యుడే పరీక్షలు చేస్తున్నారు. కానీ రోజుకు 150 మందికిపైగా కార్మికులు వైద్యసేవలకు వస్తుండటంతో ఆ డాక్టర్ ఒత్తిడికి గురై తరచూ సెలవులు పెడుతున్నాడని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. 10 రోజుల సెలవుల అనంతరం ఈ డాక్టర్ మంగళవారం విధులకు హాజరైనట్లు తెలిసింది. ఇటీవల కరీంనగర్ నుంచి ఒక డాక్టర్‌ను వారంలో రెండు రోజులు వచ్చి వెళ్లేలా యాజమాన్యం ఏర్పాటు చేసింది. కానీ ఆ డాక్టర్ వస్తాడో రాడో... అసలు ఎప్పుడు వస్తాడో ఎవరికీ తెలియదు. ఇలాంటి పరిస్థితిలో కార్మికులకు వైద్యసేవలు, ఇతర చికిత్సలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో డిపోల సంఖ్య **9**

పని చేస్తున్న కార్మికులు **4500**

విశ్రాంత ఉద్యోగులు **1500**

ఆసుపత్రిలో సిబ్బంది కొరత

6000 మంది ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు ఒకే డాక్టర్ ఉండటం, తాను ప్రతి రోజు రాకుండా రోజుల కొద్ది సెలవులు పెడుతుండటం, అందులో సిబ్బంది కొరతతో కార్మికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఆర్టీసీ ఆసుపత్రిలో నలుగురు సిబ్బంది మాత్రమే పని చేస్తున్నారు. ఇంకా అదనంగా మరో వైద్యుడు, రికార్డ్ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్, అటెండర్లను నియమించాలి. రోజురోజుకు పెరుగుతున్న సీజనల్ వ్యాధులు ఇంకా కార్మికుల అవసరాలను గుర్తించి సిబ్బందిని నియమించాలి. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న వైద్యుడు ఒత్తిడికి గురై సెలవు కోసం అనారోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించమని చెప్పిన ఓ పురుష కార్మికుడికి గర్భం దాల్చినట్లు నిర్ధారించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని అధికారులు గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యుడిని 'న్యూస్‌టుడే' ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఇలా ఇబ్బంది పడుతున్నారు..

ప్రమాదానికి గురైన కార్మికులు ఆసుపత్రికి వెళ్తే అక్కడ ఆ సమయంలో డాక్టర్ ఉండటంలేదు. ఆర్టీసీతో ఒప్పందం చేసుకున్న నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్తే ఆ యాజమాన్యం ఆర్టీసీ డాక్టర్ రెఫర్ చేస్తేనే కార్మికుడి కింద పరిగణిస్తామని చెబుతున్నారు. చేసేదేమిలేక సొంత ఖర్చులతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేసుకుంటున్నారు.

కార్మికులకు అనారోగ్య సెలవులు ఇవ్వాలంటే ఆర్టీసీ డాక్టర్ నిర్ధారించాల్సి ఉంటుంది. అనంతరం తిరిగి విధుల్లో చేరాలన్నా ఆరోగ్యంగా ఉన్నట్లు ఆయనే నిర్ధారించాలి. కానీ ఆ వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియదు. ఉన్న ఒక డాక్టర్ మాటిమాటికి సెలవు పెడుతుండటంతో ఎప్పుడు ఉంటారో తెలియక అనారోగ్యంగా ఉన్న కార్మికులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి వైద్యుల కొరత లేకుండా చూడాలని అంటున్నారు. వైద్యులు రోజూ విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



సిబ్బంది లేక వెలవెలబోతున్న ఆసుపత్రి లోపలి భాగం

మందుల కోసం 10 రోజులుగా తిరుగుతున్నా

-ఎం.వైకుంఠం, విశ్రాంత ఆర్టీసీ అధికారి



గుండె ఆపరేషన్ చేయించుకున్న మందుల కోసం 10 రోజులుగా ఆసుపత్రి చుట్టు తిరుగుతున్నా.. డాక్టర్ లేదని చెబుతున్నారు. దవాఖానా మెట్లు ఎక్కి దిగే వరకు ఓపిక సరిపోవడంలేదు. ఆసుపత్రికి వస్తే నానా ఇబ్బందులు పడుతున్నాం. యూనియన్ నాయకులు కూడా పట్టించుకోవడంలేదు. బయట మందులు కొందామనుకుంటే అంత ఆర్థిక స్థోమత మాకు లేదు. మా బాధలు ఆ దేవుడే తీర్చాలి.

మరో రెగ్యులర్ వైద్యుడి కోసం ప్రతిపాదనలు పంపాం

– తోట సూర్యకిరణ్, ఆర్ఎం, వరంగల్ రీజియన్

ప్రస్తుతం ఉన్న ఒక వైద్యుడిపై భారం పెరుగుతుంది. మరో వైద్యుడు కరీంనగర్ నుంచి వారానికి రెండు రోజులు వస్తున్నారు. రోజు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేశాం. రెగ్యులర్ మహిళా డాక్టర్ ప్రసూతి సెలవులో ఉన్నారు. కార్మికుల అవసరాలు తెలుసుకొని ఎప్పటికప్పుడు తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మరో రెగ్యులర్ వైద్యుడి నియామకం కోసం ప్రతిపాదనలు పంపాం.

గుడుంబా రహిత జిల్లాలుగా తీర్చిదిద్దడానికి చర్యలు

ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్

మత్తు పదార్థాల నియంత్రణకు సదస్సులు


హాజరైన అధికారులు

అర్బన్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందశాతం గుడుంబా రహిత జిల్లాలుగా మార్చడానికి ఎక్సైజ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ చెప్పారు. బుధవారం అర్బన్ కలెక్టరేట్‌లో గుడుంబా, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల నియంత్రణ ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా పరిధిలో గుడుంబా రవాణాను 98 శాతం నియంత్రించగలిగామన్నారు. గుడుంబా బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకుగాను 1090 కుటుంబాలను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 460 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. వరంగల్ అర్బన్, జనగామ జిల్లాలలో వందశాతం, వరంగల్ గ్రామీణ జిల్లాలో 98 శాతం, మహబూబాబాద్ 96, భూపాలపల్లిలో 95 శాతం గుడుంబాను నియంత్రించినట్లు చెప్పారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

ఉమ్మడి వరంగల్‌లో 2015 సెప్టెంబరు నాటికి 699 గ్రామాలు గుడుంబా బాధిత గ్రామాలుండగా పలు ప్రభుత్వ శాఖల సహకారంతో 640 గ్రామాలను గుడుంబా రహిత గ్రామాలుగా మార్చినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 7,966 కేసులను గుర్తించి 6,979 మందిని అరెస్టు చేశామని చెప్పారు. 62,696 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశామని, 7,53,494 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నెల రోజుల వ్యవధిలో 12 గంజాయి కేసులు నమోదు చేసి గంజాయి రవాణాను నియంత్రించినట్లు చెప్పారు. డ్రగ్స్ నియంత్రణపై 14 కళాశాలలు, 7 పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. రైళ్ల ద్వారా నల్లబెల్లం, గుడుంబా, గంజాయి రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఈ అంశంపై రైల్వే పోలీసుల సహకారంతో మత్తు రవాణాను నియంత్రిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్ కేసు వ్యవహారంపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు అకున్ సబర్వాల్ సమాధానం చెబుతూ 11 కేసులు నమోదు చేశామని విచారణ చేస్తామన్నారు. త్వరలో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామన్నారు. ఈ వ్యవహారంలో మరికొందరు సినీ ప్రముఖులున్నట్లు వస్తున్న వార్తలపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసు వ్యవహారంపై సీరియస్‌గా ఉందని దీనిలో ఎంతటి వారున్న ఉపేక్షించకుండా విచారణ సాగుతుందన్నారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ ఉప కమిషనర్ సురేష్ పాల్గొన్నారు.

రేపు కేయూలో హరిశివకుమార్ సంస్మరణ సభ

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు, సాహితీ, చరిత్రకారుడు దివగంత హరిశివకుమార్ సంస్మరణ సభ శుక్రవారం కేయూలో జరుగుతుందని తెలుగు విభాగం శాఖాధిపతి డాక్టర్ వి.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 11 గంటలకు తెలుగు విభాగంలో సభ ప్రారంభమవుతుందని వివరించారు. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర అంపశయ్యనవీన్, తెలుగు అకాడమీ మాజీ సంచాలకులు విశ్రాంత ఆచార్యులు కె.యాదగిరి, డాక్టర్ హరిసనత్‌కుమార్‌లు శివకుమార్ సాహిత్యరంగానికి చేసిన సేవలపైన ప్రసంగిస్తారని తెలిపారు. సాహిత్యవేత్తలు, విద్యార్థులు, అధ్యాపకులు హాజరుకావాలని కోరారు.

జీడీఎస్‌ల సర్వీసులను క్రమబద్ధీకరించాలి

యూనియన్ జాతీయ నేత వెంకటేశ్వర్లు

బాలసముద్రం, న్యూస్‌టుడే : తపాలా శాఖలో పని చేస్తున్న గ్రామీణ డాక్ సేవక్స్ (జీడీఎస్)ల సర్వీసులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ జాతీయ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు బొద్దున వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం జీడీఎస్‌లు దేశవ్యాప్త నిరవధిక సమ్మెకు బుధవారం పిలుపునిచ్చారు. వరంగల్ అర్బన్ జిల్లా అదాలత్ కూడలిలోని పోస్టల్ డివిజన్ కార్యాలయం ముందు మొదటి రోజు దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన జీడీఎస్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నెలలో ఒప్పందం చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో తక్కువ వేతనాలతో పని చేస్తున్న జీడీఎస్‌లకు ఉద్యోగ భద్రత కరవైందన్నారు. దేశంలో 2.70 లక్షల మంది జీడీఎస్‌లకు ఎలాంటి పింఛన్, వైద్య సౌకర్యాలు లేవన్నారు. 8 గంటల పని వేళలను గుర్తిస్తూ సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలన్నారు. దిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు మేరకు పింఛన్ వర్తింపజేయాలన్నారు. టార్గెట్ల పేరుతో అధికారులు చేస్తున్న వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ఎన్.నర్సయ్య, ఎం.కొమురారెడ్డి, ఎల్లయ్య, తిరుపతి, నరేష్ చారి, ఎం.మంగాదేవి, పద్మావతి, గౌసియాభేగం, ఉమ్మడి జిల్లా సంఘం బాధ్యులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న గ్రామీణ డాక్ సేవక్స్

మహబూబాబాద్

తెరపై ఈనాడు

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముకుంద- గౌతమ్‌నంద, వెంకట్రామ- జయ జానకి నాయక, శ్రీనివాస్- నేనే రాజు నేనే మంత్రి, లక్ష్మి-ఫిదా

ఆసుపత్రి సమాచారం

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే:

ఓపీ పనివేళలు: ఓపీ విభాగం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుంది.

అందుబాటులో ఉండే వైద్యులు:

ప్రధాన వైద్యాధికారి: భీంసాగర్

స్త్రీల శస్త్రచికిత్స విభాగం : వెంకట్రాములు, వీరన్న, మాలతీరెడ్డి, పూర్ణిమ, ఎన్.కవిత, పి.కవిత

చిన్నపిల్లల వైద్య నిపుణులు: జగదీశ్వర్, మధుసూదన్‌రావు, భీంసాగర్

జనరల్ ఫిజిషియన్ : బాలునాయక్

శస్త్రచికిత్స నిపుణులు: పర్కాల వినిల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు

కీళ్ల, ఎముకల వైద్య నిపుణులు: కల్వకూరి చంద్రశేఖర్

అనస్తీషియా (మత్తు) నిపుణులు : చింత రమేశ్, సాయిబాబా, శిరీశ్

జనరల్ వైద్య నిపుణులు: వైదేహి

దంతవైద్య నిపుణులు: రాజ్‌కుమార్, అన్నపూర్ణ

కంటివైద్య నిపుణులు : సురేందర్, సత్యనారాయణ

మెడికల్ డ్యూటీ డాక్టరు : వైదేహి

ప్రత్యేక నవజాత శిశు చికిత్సా కేంద్రం: నోడల్ అధికారి డాక్టరు జగదీశ్వర్, వైద్యులు ప్రమోద్‌రెడ్డి, చక్రవర్తి, రేఖ, ప్రవంతి అందుబాటులో ఉంటారు.

అదనపు సమాచారం కోసం ఆర్ఎంవో డాక్టరు భీంసాగర్ ఆసుపత్రి ఫోన్ నెం. 08719- 240403లో సంప్రదించవచ్చు.

వర్షంతో.. రోడ్లు జలమయం

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం మండలంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని 15 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. మరో 20 నిమిషాలు కొనసాగితే చెరువుల్లోకి భారీగా నీరు చేరి ఉండేది. వర్షానికి తోడు గాలి వీయడంతో మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. వెంటనే గమనించి ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. మార్కెట్ సెంటరులో గేటు ఎదుట నీరు నిలువడంతో చెరువును తలపించింది. మార్కెట్‌లో సరకులు షెడ్డులోనే పోయడంతో ఎలాంటి నష్టం జరగలేదు. షెడ్డులో చివరకు సరకులు పోసిన రైతులు తడవకుండా పరదాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు.



అంబేడ్కరు సెంటర్ సమీపంలో...



మార్కెట్ సెంటర్‌లో..

నాటిన మొక్కలు సంరక్షించుకుందాం

కేసముద్రం, న్యూస్‌టుడే: హరితహారం కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్కను బతికించాలని ఎంపీడీవో అరుణాదేవి అన్నారు. రంగాపురం శివారులో అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కలను పెంచడంతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి పార్వతి, పంచాయతీ కార్యదర్శి రఘువీర్, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్‌వో రాజేందర్, బీట్ అధికారులు భిక్షపతి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హరితహారంలో పాల్గొన్న ఎంపీడీవో, తదితరులు

పిల్లలకు టీకాలు వేయించాలి

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కేసముద్రం(వి) గ్రామంలోని తట్టు, రూబెల్లా వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేసముద్రం(వి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ర్యాలీని ప్రారంభించిన అనంతరం వైద్యురాలు రమాదేవి మాట్లాడుతూ పిల్లలకు టీకాలు వేయించడంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. కేసముద్రం(స్టే) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నేటి నుంచి ఈ నెల 25 దాకా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కేసముద్రం(వి) గ్రామంలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో గురువారం టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి టీకాలు వేసేవిధంగా ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

గ్యాస్‌సమాచారం

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు బుక్ చేసుకున్న రెండు రోజులకు సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదుకు 96660 23456 ఫోన్ నెంబరులో, పూర్తి వివరాలకు 08719-240220 నెంబరుకు సంప్రదించాలన్నారు.

స్థానిక శ్రీధర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ బుక్ చేసుకున్న పట్టణ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన వినియోగదారులకు 24గంటల్లో సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు ఏజెన్సీ మేనేజర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదుకు 98488 24365 నెంబరులో, పూర్తి వివరాలకు 08719-243330 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

మార్కెట్‌లో నిలిచిన ధాన్యం వేలం

కేసముద్రం, న్యూస్‌టుడే: గుమస్తాలు విధులకు హాజరు కాకపోవడంతో బుధవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం వేలం నిలిచిపోయాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఉదయం 9 గంటలకు వేలం ప్రారంభించారు. 9 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తమకు సమాచారం ఇవ్వలేదని నిరసన వ్యక్తం చేస్తూ గుమస్తాలు విధులకు హాజరు కాలేదు. ఉదయం పది గంటలకు ప్రారంభించాల్సిన వేలం మధ్యాహ్నం 2గంటల దాకా ప్రారంభం కాకపోవడంతో మార్కెట్ అధికారులు సమస్య పరిష్కారం కోసం వ్యాపారులు, గుమస్తాలతో సమావేశం నిర్వహించారు. అర్ధరాత్రి దాకా విధులు నిర్వహిస్తున్న గుమస్తాలు ఉదయం 9 గంటలకు రావడం ఇబ్బందిగా ఉందని ఆ సంఘం అధ్యక్షులు శివుడు తెలిపాడు. ఉదయం 9 గంటలకు హాజరు కావాలంటే సాయంత్రం 6 గంటలకు గుమస్తాలను ఇంటికి పంపించాలని కోరారు. పనులు ముగిసేదాకా గుమస్తాలు ఉండాల్సిందేనని వ్యాపారులు తెలిపారు. చివరకు పాత పద్ధతిలోనే ఉదయం పది గంటలకు గుమస్తాలు విధులకు హాజరు కావాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మధ్యాహ్నం 2:30 గంటలకు ధాన్యం వేలం ప్రారంభించారు.

వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా మాదిగలు వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహిస్తున్నారని వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దైద వెంకన్న ఒక ప్రకటనలో కోరారు. ఏబీసీడీల వర్గీకరణ కోసం సురేందర్ అనే యువకుడు ఆత్మబలిదానం చేసుకున్నాడని ఆయన పేర్కొన్నారు. అమరుల స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించి వర్గీకరణ సాధించుకోవాలని వెంకన్న కోరారు.

జంగిలిగొండలో చెక్‌డ్యాం ధ్వంసం

జంగిలిగొండ(మహబూబాబాద్ వ్యవసాయం), న్యూస్‌టుడే: మండలంలోని జంగిలిగొండలోని కేవులతండా సమీపంలోని చెక్‌డ్యాం ఐదేళ్ల క్రితం నిర్మించారు. భూగర్భజలాలు పెంచడం కోసం వరద నీటిని అడ్డుకట్ట వేసేందుకు ఐదేళ్ల క్రితం జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.1.20 లక్షల వ్యయంతో నిర్మించారు. చెక్‌డ్యాం వద్ద నీరు నిలిచిపోయి భూగర్భ జలాలు పెరిగి ఈ ప్రాంతంలో వ్యవసాయ బావుల్లో నీటిమట్టం పెరిగిందని రైతులు చెబుతున్నారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు చెక్‌డ్యాంను ధ్వంసం చేశారని, నీరు వృథాగా పోతోందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దర్పణం



జంగిలిగొండ శివారు కేవులతండాలో చెక్‌డ్యాం ఇలా..

అంగన్‌వాడీ చిన్నారులకు
ప్రగతి నివేదికల అందజేత



చిన్నారులకు ప్రగతి నివేదికలు అందజేస్తున్న సర్పంచి శారద

కొమ్ములవంచ(నర్సింహుల పేట), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని గ్రామ సర్పంచి సల్లు శారద అన్నారు. కొమ్ముల వంచ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసించే చిన్నారులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అందజేసిన ప్రగతి నివేదిక కార్డులను సర్పంచి వారి తల్లిదండ్రులకు బుధవారం అందజేశారు. పిల్లల అభ్యాసన వివరాలను ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలో పొందుపర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు సారమ్మ, స్వప్న, పాఠశాల ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.

మహబూబాబాద్

స్నేహభావాన్ని కలిగి ఉండాలి

కాచికల్లు(నెల్లికుదురు), న్యూస్‌టుడే: పిల్లలపై పెద్దలు స్నేహభావాన్ని కలిగి ఉండాలని కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కాచికల్లు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నైతిక విలువలు అనే అంశంపై బుధవారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుకు పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు.

సకాలంలో పనులు పూర్తిచేయాలి: కలెక్టర్

కొత్తగూడ, న్యూస్‌టుడే: రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ప్రీతిమీన ఆదేశించారు. బుధవారం కొత్తగూడకు వచ్చిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలో మంజూరైన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన భూమి కేటాయింపు పనులు తక్షణమే పూర్తిచేయాలని తహసీల్దార్ ఉప్పలయ్యను ఆదేశించారు. మండలానికి మంజూరైన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల్లో అర్హులైన వారిని ఎంపిక చేయాలని ఆదేశించారు. అధికారులంతా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపికను నిర్వహించాలని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ గుత్తేదారుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల నిర్మాణాలను ఎందుకు జాప్యం చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. తక్షణమే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జయరాంనాయక్‌ను ఆదేశించారు. ప్రతిరోజు భవన నిర్మాణ పనులను సందర్శిస్తూ వేగవంతం చేయాలన్నారు. గుత్తేదారుడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి ప్రహరీ మంజూరు లేదని ఎంపీడీవో చెప్పడంతో మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో జయరాంనాయక్, తహసీల్దార్ ఉప్పలయ్య, ఎంఈవో లక్ష్మీనారాయణ ఉన్నారు.


కొత్తగూడలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్


గంగారంలో భోజన సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

గడువు పొడిగించాలి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువత ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 80శాతం రాయితీపై అందించే రుణాల మంజూరుకు అభ్యర్థుల నుంచి స్వీకరించే దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.యాకయ్య, మాదిగ యువసేన మండల అధ్యక్షుడు టి.వెంకన్న బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉన్నత అధికారులు స్పందించి గడువును పొడిగించి యూనిట్లను పెంచాలని వారు పేర్కొన్నారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

భూపతిపేట(గూడూరు), న్యూస్‌టుడే: భూపతిపేట సమీపంలోని రాళ్లవాగు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో గూడూరుకు చెందిన పగిపాల దేవేందర్, బందాలగడ్డ తండాకు చెందిన రవికి గాయాలయ్యాయి. దేవేందర్, రవి ద్విచక్రవాహనంపై నర్సంపేటకు వెళుతుండగా నర్సంపేట వైపునకు వస్తున్న ఆటో రాళ్లవాగు వంతెనపై ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే గుర్తించిన గ్రామస్థులు స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

క్రీడల్లో రాణించిన విద్యార్థినులకు అభినందనలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన 4వ నేషనల్ షాటోఖాన్ కరాటే ఛాంపియన్ షిప్ 2017 పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన ప్రభుత్వ రామాస్ ఉర్దూ మాధ్యమం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆయిషాతస్నీం, సోహాతబస్సుంను బుధవారం ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. అండర్-12 విభాగంలో కటాస్‌లో ఆయిషాతస్నీం బంగారు పతకం, స్పారింగ్‌లో కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. అండర్-9 విభాగంలో సోహాతబస్సుం కటాస్‌లో కాంస్య పతకం, స్పారింగ్‌లో బంగారు పతకం సాధించినందుకు వారిని సన్మానించారు. కార్యక్రమంలో మానుకోట కరాటే అకాడమీ నిర్వాహకులు ఈరూనాయక్ పాల్గొన్నారు.

నిఘా కెమెరాలతోనే నేరాల అదుపు

డోర్నకల్, న్యూస్‌టుడే: నిఘా కెమెరాలతోనే నేరాల అదుపు సులభమవుతుందని స్థానిక రక్షణ వలయాధికారి ఎ. రాజయ్య పేర్కొన్నారు. డోర్నకల్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం సమావేశ ప్రాంగణంలో బుధవారం ఆయన వ్యాపారులతో సమావేశమయ్యారు. రాజయ్య మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన వీధి, రెండో వీధి, మూడో వీధితో పాటు బ్యాంకు వీధికి ఇరువైపులా ఉన్న దుకాణాల ఎదుట నిఘా కెమెరాలను బిగించాలనేది రక్షక భట శాఖ ఆలోచనని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం గైకొన్నట్లు తెలిపారు. ఆరుబయట ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగినా దానిని కెమెరా బంధిస్తుందని, విచారణలో ఇది ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. దుకాణం లోపల సైతం వీటిని బిగించుకుంటే అన్ని విధాల శ్రేయస్కరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు వ్యాపారుల వైపు నుంచి వ్యక్తమైన అభ్యంతరాలకు ఆయన సమాధానాలిచ్చారు. హాజరైన వ్యాపారుల పేర్లను నమోదు చేశారు. రాని వ్యాపారులకు దీని గూర్చి తెలియపరచాల్సిన బాధ్యత తోటి వ్యాపారులదేనన్నారు. సమావేశంలో రక్షక భట నిలయం అధికారులు నాగభూషణం, మురళీధర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోనే డీలర్ల అవగాహన సదస్సు

మన్నెగూడెం(డోర్నకల్), న్యూస్‌టుడే: డోర్నకల్‌లో 18న జరిగే డీలర్ల అవగాహన సదస్సు వేదిక మారిందని ప్రభుత్వ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు తేజావతు లక్ష్మా తెలిపారు. మన్నెగూడెంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సు మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో జరుగుతుందని చెప్పారు. డీలర్లు ఈ మార్పును గమనించాలని విజ్ఞప్తి చేశారు

గోపా ఆధ్వర్యంలో పాపన్న జయంతి

కొత్తగూడ, న్యూస్‌టుడే: గోపా ఆధ్వర్యంలో కొత్తగూడలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గౌడ కులంలో పుట్టిన పాపన్న సాహసోపేతమైన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రమేష్, అవినాష్, శ్రీనివాస్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు,న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో మొక్కలు నాటి చెట్లను అభివృద్ధి చేసి ఆచెట్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గౌడులకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని గోపా జిల్లా అధ్యక్షుడు బిక్కి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం జరిగిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమలో ఆయన మాట్లాడుతూ పాపన్న స్ఫూర్తితో గౌడ హక్కుల సాధన కోసం అందరు కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాల్లో భాగస్వాములను చేయాలన్నారు.


గూడూరులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు.

ఎస్సీలకు కార్పొరేషన్ రుణాలను చెల్లించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఎస్సీలకు మంజూరు చేసిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంద శశికుమార్ కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014-15 నుంచి నేటి వరకు ఒక్కరికి కూడా రుణాలు అందజేయలేదని ఆయన ఆరోపించారు. పురపాలక అధికారులు, వివిధ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో పలువురు నష్టపోయారని ఆయన ఆరోపించారు. అర్హులకు నిధులు విడుదల చేయడంతో పాటు నూతనంగా దరఖాస్తు చేసినవారికి మంజూరు చేయాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గాను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి, సంస్థాగత ఎన్నికలకు వెళుతున్నట్లు ఆ పార్టీ మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.సత్యపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు హెచ్. వెంకటేశ్వర్లు అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, పలువురికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల నియామకం, గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తెరాస నేతలు ప్రభుత్వ కార్యాలయాలను పార్టీ కార్యాలయాలుగా, అధికారులను పార్టీ కార్యకర్తలుగా మారుస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. అనంతరం మండలంలోని శ్రీరామగిరి గ్రామశాఖ కమిటీని ఎన్నిక చేసి వివరాలను మండల పార్టీ అధ్యక్షుడు బైరు అశోక్‌గౌడ్ ప్రకటించారు.

పర్వతగిరిలో ఉచిత వైద్యశిబిరం

పర్వతగిరి(మహబూబాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని పర్వతగిరిలో బుధవారం అమెరికా తెలుగు అసోసియేషన్ ఛైర్మన్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా సంయుక్త కలెక్టర్ దామోదర్‌రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జేసీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినా.. సొంత గ్రామాన్ని మరచిపోవద్దని, సేవా దృక్పథంతో పని చేయాలని పేర్కొన్నారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, డీఎస్పీగా పని చేసిన క్రమంలోనే తన సొంత గ్రామానికి సేవా చేసినట్లు వివరించారు.



మాట్లాడుతున్న జేసీ దామోదర్‌రెడ్డి

CLASSIFIEDS

YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, HOMEO ... COOKING ... MESS ... OLOGY ... FOUND
GIFTS, COURIERS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

BIRTHDAY GREETINGS



AUTOMOTIVE

VEHICLES FOR SALE

New Tata Ace Megha For Sale 2400 K.m Driven Tata Ace For Sale. Blue Colour, 8 Months Old. Cont: 9177775998, 9985584612.

BUSINESS SERVICES

BUSINESS OFFER

Data Entry new Project available with High Payout & Long Term Contract Min 5- Systems & Office setup Mandatory ✆ 9849978524.

తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఉంటూ పేపర్ ప్లేట్స్ తయారుచేసే మెషిన్లు కలవు. ముడిసరకు మేమే ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం, అగ్రిమెంట్ కలదు, Govt. రిజిస్ట్రేషన్. సాయి విగ్నేష్ ఏజెన్సీస్, ✆ 90302 18788, 888598884.

ఎలక్ట్రానిక్స్ & హోమ్‌నీడ్స్ ఫర్నీచర్ ప్రోడక్ట్స్‌ని మార్కెట్ చేయుటకు బిజినెస్ చేయగల ప్రమోటర్స్, గ్రూప్ లీడర్స్ కావలెను. Cont: 9100656568.

Puthra A&M Pvt Ltd కంపనీకి మీ ప్రాంతంలో ప్రాంఛైజీలు ఏర్పాటుకై సంప్రదించండి: Visit: www.mycashinon.com, Wanted సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ✆ 040-32507777/ 9394847777

BUILDING & CONSTRUCTION

SEPTIC TANK CLEANING

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు Cont: 9849145043, 9866584455.

EDUCATION

కేవలం 2 1/2 నెలల్లోనే ఇంటర్/డిగ్రీ, బి.టెక్, ఎమ్‌టెక్, MBA, M.Phil. P.HD. పూర్తి Eligible for Govt & Private Jobs. C/o. DSR కాలేజి, HNK 9346634381.

లైఫ్‌లైన్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో Admissions are in progress. GNM 3 సం॥రాల కోర్సు. విద్యార్హత: ఇంటర్, SC, ST, BC & మైనర్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ. సంప్ర॥ లైఫ్‌లైన్ హాస్పిటల్. # 2-4-152, పాత బస్‌డిపో, రాంనగర్, హన్మకొండ. సెల్: 9963050736.

REAL ESTATE

PLOT FOR SALE

వరంగల్ భట్టుపల్లిలో వైష్ణవి ఎన్‌క్లేవ్ మరియు ఆవాస ఎన్‌క్లేవ్‌లో కుడా లేఅవుట్ ప్లాట్లు అమ్మబడును. సెల్ నెం:7660008666, 8897157403.

SITUATIONS VACANT

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపనీలో పనిచేయుటకు ఏరియాల వారిగా Agents కావలెను. (Salary 10,000 to 25,000) Cell: 8317680173.

Hydలోని ప్రముఖ లి॥కం॥లకై హెల్పర్స్, ప్యాకర్స్, క్యాటరింగ్ బాయ్స్ అర్జెంటుగా కా॥ జీ: 13-18 వేలు. రూం+మీల్స్ ఫ్రీ. చదువు లేకున్నా జాబ్ సంప్ర: 9515871636

ధరణి ప్రాజెక్టు మహబూబాబాద్ నందు "ఫీల్డ్ ఆఫీసర్స్"గా పనిచేయుటకు మార్కెటింగ్ అనుభవం కలిగిన యువతీ, యువకులు కావలెను. జీ: 20 వేలు మరియు గిఫ్ట్స్, ఇన్సెంటివ్స్ కలవు. 9133271155, 9010353353

వంటమనిషి కావలెను. బ్రాహ్మణులు, వైశ్య, మర్వాడి వారు కావలెను. Hyd. Cont: 9959710502.

HNK, Kishanpura లోని శ్రీ లక్ష్మి నర్సింగ్ హోమ్ నందు పని చేయుటకు BSc/GNM నర్సులు కావలెను. సం॥ 9848039034, 9182634040.

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

ప్రముఖ బట్టల షాపులో పనిచేయుటకు Sales Girls కావలెను. Only Ladies. Ex: 2 Year's. Cont: 9701572572, 9940444004.

SSBS **ఇండస్ట్రీ** నందు పనిచేయుటకు సూపర్‌వైజర్లు కం., కంప్యూటర్ ఆపరేటర్, ఇన్‌ఛార్జ్స్, టీమ్ లీడర్స్, హెల్పర్స్ కావలెను. జీతం: 15,000 - 20,000. ✆ 72860 55526, 70953 08439.

ప్రైవేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్, DATA Entry, మార్కెటింగ్ (or) Sales (M/F) అర్జెంట్‌గా కావలెను. 8187888708, 709.

మావద్ద పనిచేయుటకు రిసెప్షనిస్ట్, Executives, Marketing, వంటమనిషి కావలెను. Qualification: Inter or above. సంప్ర: Cell No. 7386349568.

వంటమనిషి లేడీస్ హాస్టల్‌లో ఉండి వంట చేయుటకు వెంటనే కావలెను. మూడుచింతల్ దగ్గర, నయీంనగర్, హన్మకొండ. సంప్ర॥ 9618450807.

FACULTY / TEACHERS

Lady Teachers from Warangal City only for preprimary & Eng. Maths, SOC, SCI, COMP, Bio. Complete E/M background. St. Thomos School. Labour Colony, Wgl. Ph: 9849397927.

మామునూరు శివారు నందుగల నవోదయ కోచింగ్ సెంటర్ నందు ఇంగ్లీషు బోధించుటకు పార్ట్‌టైం ఇంగ్లీషు టీచరు కావలెను. 9676145612, 8978567783.

Wanted Teachers to Teach English, Maths & Social for Lower Classes (1st to 5th) Required Immediately. Salary Very Negotiable. Resi. Teachers are preferred. Cont: 7659980002, 9849785506.

TOURS & TRAVELS

కాశీయాత్ర- కాశీ, ప్రయాగ ,నైమిషారణ్యం, గయ 9రో॥వ॥భో॥ 6000/- Oct-2 రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, కంచి 8రో॥ 6200/-వ॥భో॥ 7-9&20-9. సత్యసాయి సేవాసమాజ్ 9618933189

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



ప్రభుత్వ పాఠశాలల్లో 'చిన్నారి డాక్టర్'

ప్రారంభించిన కలెక్టర్ ఆమ్రపాలి


చిన్నారి డాక్టర్ బృందంతో కలెక్టర్ ఆమ్రపాలి, సీపీ సుధీర్‌బాబు

బాలసముద్రం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారి డాక్టర్ అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారు. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో పాఠశాలలు, గురుకుల సంక్షేమ హాస్టళ్లలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. బుధవారం హన్మకొండ లష్కర్‌బజార్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆమ్రపాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతి నుంచి ఉత్సాహవంతులైన విద్యార్థులను 5 మందిని చిన్నారి డాక్టర్ బృందంగా ఎంపిక చేస్తామన్నారు. ఒక టీచర్ పర్యవేక్షణలో వారు తోటి మిత్రులకు జ్వరం, జలుబు, కడుపునొప్పి లాంటి సమస్యలు తలెత్తితే వెంటనే మాత్రలు అందజేస్తారన్నారు. ఏ వయసు వారికి ఎలాంటి మోతాదు మాత్రలు అందించాలనే విషయంలో ఎంపిక చేసిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ కల్పిస్తామన్నారు. వైద్య చిట్కాలతోపాటు, వ్యక్తిత్వ వికాసం, సామాజిక అంశాలపై చిన్నారి డాక్టర్లు కృషి చేస్తారన్నారు. వారంలో ఒక రోజు అవగాహన పెంపొందించడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. గురువారం నుంచి 25 సెప్టెంబరు వరకు నిర్వహించే రూబెల్లా, తట్టు వ్యాక్సిన్లను 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసులోపు పిల్లలందరికీ వేయించాలన్నారు. బాల్య వివాహాలు జరిగినట్లు తమ దృష్టికి తీసుకొస్తే రూ.5 వేల రివార్డు అందజేస్తామని ప్రకటించారు. సమాచారం అందించిన మొదటి వ్యక్తికి మాత్రమే రివార్డు ఉంటుందన్నారు. పోలీస్ కమిషనర్ జి. సుదీర్‌బాబు మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు షీటీంలు ఉన్నాయని ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తేవాలన్నారు. ఇందుకోసం 94910 89257 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అర్బన్ జిల్లా డీఈవో శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. 'చిన్నారి డాక్టర్' అనే కార్యక్రమం ద్వారా అనారోగ్య సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హరీష్‌రాజ్ మాట్లాడుతూ.. 2020 నాటికల్లా మీజిల్ రూపుమాపడం కోసం పలు రకాల వ్యాక్సిన్లను అందిస్తున్నామన్నారు. ఎలాంటి అపోహలు లేకుండా వ్యాక్సిన్లు వేయించవచ్చని చెప్పారు. అనంతరం కలెక్టర్ ఆమ్రపాలి చేతుల మీదుగా చిన్నారి డాక్టర్లకు వైద్య కోటు అందించారు. పాఠశాల ఆవరణలో సీపీతో కలిసి మొక్కలు నాటారు. షీటీం బృందం ఆత్మరక్షణ కోసం తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆదిరాజు శైలజ, హన్మకొండ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అవిర్నేని సంపత్‌రావు, ఎస్‌ఎంవో ప్రగత్, డీఐవో శ్యామల నీరజ, జీసీడీవో రమ, ఏఎంవో మనోజ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న షీటీం బృంద సభ్యులు

ప్రజల ప్రశంసలే సిబ్బందికి రివార్డులు

పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజల ప్రశంసలే పోలీసు అధికారులు, సిబ్బందికి రివార్డులని వరంగల్ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. పోలీసుశాఖలో పని చేస్తూ ఉత్తమ సేవలందించిన సెంట్రల్‌జోన్, ఈస్ట్ జోన్ సిబ్బందికి బుధవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలను అందజేశారు. సెంట్రల్ జోన్ నుంచి 82 మందికి, ఈస్ట్‌జోన్ నుంచి 16 మందికి పత్రాలిచ్చారు. సెంట్రల్ జోన్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సర్దార్, మిల్స్‌కాలనీ, ఎల్కతుర్తి, ఇన్‌స్పెక్టర్లు తిరుమల్, సతీష్‌చందర్‌రావు, ఆర్ఐ నాగయ్య, పే సెక్షన్ పర్యవేక్షకురాలు రమాదేవి, ఎస్సైలు నరసింహారావు, సతీష్, రాజేందర్, మొగిలి, శ్రీధర్, ప్రభుదాస్, నాగబాబు, వెంకట్రావ్, సీనియర్ సహాయకులు ఐలయ్య సత్యనారాయణరెడ్డి, ఆరుగురు ఏఎస్సైలు ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 51 మంది కానిస్టేబుళ్లు ముగ్గురు హోంగార్డులు ఈస్ట్ జోన్ నుంచి పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పరకాల ఎస్సై శ్రీకాంత్, సంగెం ఎస్సై దీపక్, హెడ్‌కానిస్టేబుళ్లు చేరాలు, సత్తయ్య, అమరేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు కృష్ణ మోహన్, గౌస్‌పాషా, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, లింగస్వామి, రాజు, దేవు, రంగయ్య, జ్యోతి, హోంగార్డు ఇరయ్యలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. పోలీసుశాఖలో రాణించిన సిబ్బందికి శాఖాపరమైన గుర్తింపు ఉంటుందన్నారు. రివార్డులు, ఉద్యోగుల బాధ్యత మరింత పెంచుతాయని అన్నారు. కమిషనరేట్ పరిధిలో అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయడంతో హరితమిత్ర అవార్డును అందుకున్నామని తెలిపారు. రానున్న రోజులలో ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంపొందించే విధంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ వేణుగోపాల్‌రావు, ఈస్ట్‌జోన్ డీసీపీ ఇస్మాయిల్, హన్మకొండ ఏసీపీ మురళీధర్, ఏఆర్ ఏసీపీ విద్యాసాగర్, సదానందం, ఆర్ఐ నాగయ్య, ఇన్‌స్పెక్టర్లు విద్యాసాగర్, సంజీవరావు, పోలీసు సంక్షేమ అధికారి శ్రీధర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఈస్ట్‌జోన్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న సిబ్బందితో ఉన్నతాధికారులు

రక్త దాన శిబిరం

బాలసముద్రం, న్యూస్‌టుడే : హన్మకొండలోని అక్షర చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీ ఛైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఉద్యోగులు 300 మంది శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో చిట్‌ఫండ్ ప్రతినిధులు రంజన్‌రెడ్డి, ఎల్లయ్య, హనుమంతు, రాజు, జితేందర్, రాజేందర్, కొండల్‌రావు, మంద శ్రీను తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న శ్రీనివాసరావు

పంచాయతీ భవనాలు పూర్తయ్యేదెన్నడో..!

అధికారుల పర్యవేక్షణ లేక నత్తనడకన జరుగుతున్న పనులు

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే

గ్రామ పంచాయతీలు : 231

మంజూరైన భవనాలు : 109

కేటాయించిన నిధులు : రూ.14.94 కోట్లు

పూర్తయిన భవనాలు : 13



శిథిలావస్థలో ఉన్న పంచాయతీ కార్యాలయం

గ్రామాల్లో సభలు సమావేశాలు నిర్వహించడానికి పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి ఇబ్బందులను తొలగించడానికి పంచాయతీ భవనాలు లేని వాటికి ఉపాధి పథకం నిధులతో నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్థలాలు లేకపోవడం, పర్యవేక్షణ లోపం వంటి కారణాలతో కొన్ని చోట్ల పనులు ఆగిపోగా మరి కొన్ని చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనాలు గుర్తించి నూతన పంచాయతీ భవన నిర్మాణానికి జిల్లాలో మొత్తం 109 పంచాయతీ భవనాలకు రూ.14.94 కోట్లు విడుదల చేసింది.

109 పంచాయతీ భవనాలకు నిధులు విడుదల

మహబూబాబాద్ జిల్లాలోని శిథిలావస్థలో ఉన్న పంచాయతీకి ఉపాధిహామీ పథకంలో రూ.13 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఏడాదిలో ఏప్రిల్ మొదటి విడతగా 13 గ్రామ పంచాయతీలకు రూ.1.69 కోట్లు నిధులు మంజూరు చేయగా, రెండో విడత 76 పంచాయతీలకు రూ.9.88 కోట్లు విడుదల చేసింది. రెండు విడతల్లో మొత్తం 89 గ్రామ పంచాయతీలకు రూ.11.57 కోట్ల నిధులు కేటాయించింది. గిరిజన ప్రాంతాల్లో 20 పంచాయతీల భవనాలకు రూ.16.85 లక్షల చొప్పున రూ.3.37 కోట్ల నిధులు విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 109 పంచాయతీ భవనాలకు రూ.14.94 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.



జంగిలిగొండలో కొన్ని నెలల క్రితం పనులు ప్రారంభమైనా పరిస్థితి ఇలా..

13 పంచాయతీలు మాత్రమే పూర్తి

జిల్లాలో 109 పంచాయతీలకు రూ.14.94 కోట్లు మంజూరయ్యాయి. తొలి విడతలో మంజూరైన 13 పంచాయతీ భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. రెండో విడతలో మంజూరైన 76 పంచాయతీ భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. గిరిజన శాఖలో మంజూరైన 20 పంచాయతీలు ఇదే దుస్థితిలో ఉన్నాయి. మహబూబాబాద్ మండలం ఆరు పంచాయతీలు వివిధ దశల్లో ఉన్నాయి. ముడుపుగల్లు, వీఎస్ లక్ష్మీపురం, నడివాడ, పర్వతగిరి, నెల్లికుదురులో స్థలం లేక నిర్మించలేదు. ఇలా జిల్లాలో స్థలాలు లేక కొన్ని, స్థలాలు ఉన్న అధికారుల నిర్లక్ష్యంతో మరికొన్ని నిలిచిపోయాయి.

పనులు వేగవంతం చేస్తున్నాం

– సురేశ్, ఈఈ, పంచాయతీరాజ్

జిల్లాలో కొన్ని గ్రామాల్లో స్థలాల సమస్య ఉంది. స్థలాలున్న చోట నిర్మించేందుకు పనులు వేగవంతం చేస్తున్నాం. సగానికిపైగా పనులు వివిధ దశలో ఉన్నాయి. నాణ్యతతో పంచాయతీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు.

అసంపూర్తి పనులతో రోడ్డెక్కిన గిరిజనులు



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న దృశ్యం

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి అసంపూర్తి పనులతో రోడ్డుపై నీరు నిలిచి ఇళ్లలోకి వస్తున్నాయని బుధవారం పట్టణ శివారు సాలార్‌తండాలోని రోడ్డుపై గిరిజనులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. అంతేగాక ఇక్కడ చేపడుతున్న మిషన్ భగీరథ పనులు కూడా నిలిపేసి అందోళనకు దిగారు. దీంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా ఉమ్లా, శివాజి, కల్యాణ్, బాలాజీ, బాలులు మాట్లాడుతూ జాతీయ రహదారి పనుల్లో సైడు కాలువలు అధ్వానంగా మారడంతో నీరు ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సైడుకాలువ, పైపులైను నిర్మించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి వచ్చారు. జాతీయ రహదారుల శాఖ అధికారులు ఇచ్చిన హామీతో ఆందోళన ముగించారు.

స్వచ్ఛ రైలు.. స్వచ్ఛ భారత్ వారోత్సవాలకు శ్రీకారం



స్వచ్ఛ రైలు స్వచ్ఛ భారత్ గురించి అధికారుల ప్రచారం

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ జంక్షన్‌లో స్వచ్ఛ రైలు- స్వచ్ఛ భారత్ వారోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈనెల 29వ తేదీ వరకు రోజుకొక పేరుతో వీటిని నిర్వహిస్తారు. తొలి రోజు స్వచ్ఛత గూర్చి రైలు ప్రయాణికులకు అవగాహన కలిగించారు. ప్లాట్‌ఫారంపై ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛ రైలుతో స్వచ్ఛ భారత్ కల సాకారమవుతుందని నినదించారు. రైలొచ్చి ఆగినప్పుడల్లా బోగీల వద్దకెళ్లి రైల్వేస్టేషన్లతో పాటు రైళ్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకతను కళ్లకు కట్టారు. తొలుత రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద ప్రతి ఒక్కరం విధిగా స్వచ్ఛత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ డోర్నకల్ ఏడీఈఎన్ మహేందర్‌సింగ్, స్టేషన్ సూపరింటెండెంటు హరిరాం, క్యారేజీ అండ్ వ్యాగన్ విభాగం సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాస్ నాయకత్వం వహించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



హాస్టల్ పర్యవేక్షకురాలు సంధ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

గంగారం, న్యూస్‌టుడే: గంగారంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాల, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలను బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ప్రీతిమీన అకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు సంబంధించిన తరగతి గదులను పరిశీలించారు. ఈ గదుల్లో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులు తిరుగుతూ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పలువురు బాలికలతో లెక్కలు చేయించారు. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలువేస్తూ విద్యార్థులు నేర్చుకుంటున్న తీరు, వారికున్న అవగాహనను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి భోజనాన్ని అందిస్తున్నారనేది కలెక్టర్ వారినే అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. డిప్యూటి వార్డెన్ నిర్వాహణ తీరు సరిగాలేదని హెచ్చరించారు. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటుచేస్తున్న పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

నూతనంగా ఏర్పడిన కస్తూర్బా గాంధీ పాఠశాలను కలెక్టర్ సందర్శించినపుడు పాఠశాలలో విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటంతో గురుకుల సిబ్బందిపై మండిపడ్డారు. వారం రోజుల్లో రెండు తరగతుల్లో 80 మంది విద్యార్థులు వచ్చేలా పనిచేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెంచకుంటే సీఆర్‌టీలను తగ్గిస్తామన్నారు. పాఠశాల సిబ్బందికి సరిపోను విద్యార్థినులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో జయరాంనాయక్, ఎంఈవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఐస్ స్కేటింగ్‌లో రజత పతకం



రజత పతకం సాధించిన శ్రీహాన్

కురవి, న్యూస్‌టుడే: కురవి మండలం తిర్మాలపురం గ్రామానికి చెందిన పుప్పాల శ్రీహాన్ జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్‌లో రజత పతకం సాధించాడు. ఈ నెల 5న కరీంనగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. మంగళవారం న్యూదిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లో మొత్తం తెలుగు రాష్ట్రాల నుంచి 30 మంది పాల్గొనగా, అందులో అండర్ సబ్ జూనియర్ విభాగం పోటీల్లో శ్రీహాన్ మంచి ప్రతిభ చూపి రజత పతకం సాధించాడు. ఇతని తండ్రి అరుణ్‌కుమార్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆర్ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు.

20న 'కుంపటి' పుస్తకావిష్కరణ సభ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కవి, గాయకుడు మండవరాజు మల్లేశ్ రచించిన కవితా సంపుటి 'కుంపటి' పుస్తకావిష్కరణ ఈ నెల 20న ఆవిష్కరించనున్నట్లు దళిత బహుజన రచయితల, కళాకారులు, మేధావుల ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరె వెంకన్న తెలిపారు. కవితా సంపుటి ఆవిష్కరణ సభ గోడ పత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. పుస్తకావిష్కరణ సభకు ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, ప్రముఖ వాగ్గేయకారుడు జయరాజు, కవులు కోటేశ్వరరావు, రవీందర్, దార్ల రామచంద్రు, బండ వెంకన్న పాల్గొన్నారు.



నేటి చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
	కిలో వెల రూపాయలలో	
ఫారం	76	78
హోల్‌సేల్	-	-
లైవ్ రిటైల్	90	93
డ్రెస్డ్ స్కిన్‌తో	126	135
స్కిన్‌లెస్	149	158

సుగుణ : 93479 48884, 93464 02116

వెన్‌కాబ్ : 98492 19870 న్యూస్‌టుడే, కాజీపేట

మూడేళ్ల పాలనలో ఏం చేశారు

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పాలకులు హామీలే తప్ప ఈ మూడేళ్ల పాలనలో ఏం చేశారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా ప్రథమ మహాసభల సందర్భంగా మహబూబాబాద్‌లో రెండు రోజులు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రధాని తరచూ మాట్లాడుతూ రాబోయేవి మంచి రోజులని పదే పదే చెబుతున్నారని ఐతే ఈ మూడేళ్లు చెడ్డ రోజులని భావించాలా అని ఆయన ప్రశ్నించారు. సీఐటీయు నేత తోట భిక్షం అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ మేకిన్ ఇండియా.. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా అంటూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వాలు ఎక్కడ పరిశ్రమలు నెలకొల్పారని, ఎంత మందికి ఉద్యోగాలిచ్చారని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వమని చెబుతూనే ఏకపక్షంగా నియంతృత్వ పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమాలను విస్మరించి వారిపై పరోక్షంగా నష్టం కలిగించే విధానాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వాలు ప్రైవేటీకరణకు అనుకూలంగా తమ విధానాలు అమలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరముందని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'జీఎస్టీ-వివిధ రంగాలపై ప్రభావం' అంశంపై నిర్వహించిన సదస్సులో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం నేటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు. జీఎస్టీతో ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.




జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సాయిబాబు

సంపన్నులకు అండగా ప్రభుత్వాలు

పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణక్క

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు మాత్రమే రాయితీ ఇస్తుందని, పేద ప్రజలకు కోత పెడుతోందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్ర అరుణక్క ఆరోపించింది. బుధవారం స్థానిక గుమ్ముడూరు నుంచి వివేకానంద సెంటరు దాకా ప్రదర్శన చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాస్ రాయితీ ఎత్తివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని, రాయితీని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా అందించే సరకులన్నింటిని యదావిధిగా సరఫరా చేయాలని కోరారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి ఊకే పద్మ, జిల్లా అధ్యక్షురాలు నర్సక్క, ఐలమ్మ, మీనమ్మ, లీల, ఎర్రక్క, సరోజ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



పెద్ద నోట్ల రద్దు.. నల్లధనం వెలికితీత.. స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకం.. పెద్ద ఫలితాలనే ఇచ్చాయి. పెద్దఎత్తున నల్లధనం వెలుగుచూడడంతో పాటు ఆదాయ మార్గాలను పలువురు స్వచ్ఛందంగా వెల్లడించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారు. స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకంలో ముందుకొచ్చినవారితో పాటు ఆదాయ పన్నును చెల్లించడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడం ఉమ్మడి జిల్లాను తెలుగు రాష్ట్రాల్లో అగ్రస్థానంలో నిలిపింది. వరుసగా మూడేళ్లలో పన్ను చెల్లింపుదారులు పెరగడంతో పాటు పన్నుగా చెల్లించిన మొత్తం కూడా పెరిగింది. దీంతో వృద్ధి రేటు పరుగులు తీసింది.

ఆదాయం పెరుగుతోంది..

న్యూస్‌టుడే, గిర్మాజీపేట

ఆదాయ పన్ను వృద్ధి రేటులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు 2016-17 సంవత్సరంలో సగటున 21.04 శాతం వృద్ధిసాధించగా వరంగల్ ఉమ్మడి జిల్లా ఆదాయ పన్ను శాఖ కార్యాలయం 58 శాతం రేటు సాధించింది. ఈ రేటుతో రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదాయ పన్ను శాఖ 1860 సంవత్సరం జులై 24న ప్రారంభమైన నేపథ్యంలో వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని నిజాం కాలం నాటి ఆయకర్ భవనంలో గత నెలలో ఉత్సవాలు నిర్వహించారు. ఆనాటి వేడుకలకు హాజరైన అధికారులు పన్ను రేటు వృద్ధికి, చెల్లింపుదారులు పెరిగిన నేపథ్యంలో సంబురాలు నిర్వహించారు. ఒకప్పుడు ఈ కార్యాలయం ముందు నుంచి వెళ్తే పట్టుకుంటారనే భయం ప్రజల్లో ఉండేది. సమాజంలో వచ్చిన మార్పులతో అలాంటి రోజుల నుంచి నేడు స్వచ్ఛందంగా ఆదాయ పన్ను రిటర్నులను దాఖలుచేసేంతగా అవగాహన పెరిగింది. ఫలితంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సంపన్నులు, ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక రంగాల్లో ఆదాయం ఆర్జిస్తున్నవారు పన్ను చెల్లింపునకు ముందుకు రావడంతో చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

పెరిగిన అవగాహన..

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం కల్పించారు. అధిక ఆదాయ మార్గాలున్నవారు స్వచ్ఛందంగా వెల్లడిస్తే ఎలాంటి జరిమానాలు విధించేదిలేదని, సంబంధిత వ్యక్తుల పేర్లను కూడ బహిర్గతం చేయమని ప్రకటించి ముందుకొచ్చే వారికి కొన్ని రాయితీలు కూడా ఇచ్చారు. దీంతో చాలామంది ముందుకొచ్చారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు 1000 మందిని అధికారులు గుర్తించగా ఇందులో 600 మంది వరకు ఈ పథకం కింద స్వచ్ఛందంగా ఆదాయాన్ని వెల్లడించారు. ముందుగా ప్రకటించినట్లుగానే అధికారులు ఆయా వ్యక్తులు, సంస్థల పేర్లను వెల్లడించలేదు. దీనితో పాటు ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసే విషయంలో ప్రజలకు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించారు. సాధారణ నోటీసులతో పాటు ప్రత్యేక నోటీసులను జారీచేశారు. సకాలంలో పన్ను రిటర్నులు దాఖలు చేయనివారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పన్ను రిటర్నులు దాఖలు చేయడంలో సందేహాలను నివృత్తి చేయడం, అనుమానాలను తీర్చడం, అవగాహన కల్పించడం లాంటి చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఇలా అనేక రకాలుగా కల్పించిన అవగాహన ఫలితంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఆదాయం కలిగి పన్ను చెల్లింపునకు ముందుకురాని వారు ముందుకు రాగలిగారు. ప్రధానంగా 2016 నవంబర్ 8న పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత బ్యాంకు ఖాతాల్లో రూ.2.5 లక్షల కంటే ఎక్కువగా నగదు జమచేసిన వారికి ఆదాయ పన్ను శాఖ హైదరాబాద్ నుంచి నోటీసులు జారీచేసింది. ఆయా డిపాజిట్లకు సంబంధించిన ఆదాయంపై సమాధానం చెప్పాలంది. దీంతో చాలా మంది దొరికిపోయారు. ఇంతకాలం పన్ను చెల్లించకుండా అధిక ఆదాయం కలిగిన వారంతా పన్ను చెల్లింపుదారులుగా మారాల్సి వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆదాయ పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

ఉమ్మడి జిల్లావాసుల ఆదాయం పెరిగిన నేపథ్యంలో పన్ను వసూలు 58 శాతం వృద్ధి రేటును సాధించింది. భవిష్యత్తులో దీన్ని వంద శాతం చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. నోట్ల రద్దు అనంతరం పెరిగిన ఆదాయ పన్ను కారణంగా రిటర్నులు దాఖలు చేసేవారి సంఖ్య వచ్చే మూడు నెలల్లో మరింతగా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో వరంగల్‌కు ప్రథమ స్థానం


58 శాతం వృద్ధి రేటు

ఉమ్మడి జిల్లాలో పెరిగిన పన్ను చెల్లింపుదారులు

గత మూడేళ్లలో ఎగిసిన వృద్ధి రేటు

నోట్ల రద్దు.. ప్రజల్లో పెరిగిన అవగాహన

ఆదాయం	స్థూల (రూ. కోట్లలో)	నికర (రూ. కోట్లలో)
2014-15	177.81	118.13
2015-16	179.68	107.90
2016-17	312	207



వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నవారు వరుసగా పెరుగుతున్నారు.

2014-15	56,276
2015-16	55881
2016-17	78236

డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారుల ద్వారా పన్ను మినహాయింపు

ప్రస్తుతం అమల్లో ఉన్న పన్ను రేట్ల ప్రకారం ఉద్యోగి చెల్లించాల్సిన ఆదాయ పన్నును లెక్కించి దాన్ని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీవో) మినహాయించాలి. ఉద్యోగి ఆర్థిక సంవత్సరానికి పొందిన మొత్తం వేతనంపై ఆదాయాన్ని అంచనా వేయాలి. ఉద్యోగి ప్రకటించిన తన ఇతర ఆదాయాలను కూడా దీనికి కలపాలి. విడిచిపెట్టిన ఆదాయాలు, మినహాయింపులు, రాయితీలు, ఉపశమనాలను పరిగణనలోకి తీసుకోవాలి. అందుకనుగుణంగా ఈ సంవత్సరం నుంచి సదరు ఉద్యోగి పొదుపుచేసిన వాటి వివరాల కాపీలను జతచేయాలని ఈ సంవత్సరం ప్రభుత్వం ఆదేశించింది. నిజపత్రులను చూపినప్పుడే డీడీవో పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినట్లు ఆదాయపన్ను శాఖ అధికారులు తెలిపారు.

పాన్ కార్డుదారులంతా పన్ను చెల్లించడం లేదు..



దేశవ్యాప్తంగా 11 కోట్ల పాన్ కార్డుదారులుండగా అందులో నాలుగు కోట్ల మంది మాత్రమే పన్ను చెల్లిస్తున్నారని ఆదాయ పన్ను శాఖ అధికారులు చెబుతున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు 10 లక్షల మంది వరకు పాన్‌కార్డుదారులుండగా వీరిలో 78 వేల మంది మాత్రమే పన్ను చెల్లింపుదారులుగా గుర్తింపుపొందారు. వీరే ఏటా రిటర్నులు దాఖలు చేస్తున్నారు. మిగిలిన వారు కార్డులను వివిధ అవసరాల కోసం తీసుకున్నారు. బ్యాంకులో రూ.50 వేలకు మించి నగదు జమ చేసినప్పుడు పాన్‌కార్డు అవసరమవుతోంది కాబట్టి ఎక్కువ మంది తీసుకున్నారు. అలాగే గృహ, వాహన రుణాలతో పాటు ఇతర అవసరాల కోసం పాన్‌కార్డులు తీసుకున్నవారు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు.

పరిశోధన బాట



కేయూలో పీహెచ్‌డీలపై పెరుగుతున్న ఆసక్తి

ప్రవేశపరీక్ష రాసేందుకు సన్నద్ధం **ఏటా వృద్ధిచెందుతున్న విద్యార్థుల సంఖ్య**

పీహెచ్‌డీ కోర్సు పరీక్ష రాసినవారు

కోర్సు	పరీక్ష రాసినవారు
కామర్స్	1023
కంప్యూటర్స్	838
ఈసీఈ	656
తెలుగు	581
ఫార్మసీ	562
ఫిజిక్స్	210
గణితం	295
కెమిస్ట్రీ	459
ఆంగ్లం	429
ఈఈఈ	421
వృక్షశాస్త్రం	229
మెకానికల్	407
సోషియాలజీ	347
ఎకనామిక్స్	244
సివిల్ ఇంజినీరింగ్	261
జువాలజీలో	232
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	205
ఇతర కోర్సుల్లో	150

7332 మంది ప్రవేశ పరీక్ష రాశారు.

న్యూస్‌టుడే, కేయూ క్యాంపస్

ప్రపంచవ్యాప్తంగా పలు రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలను లోతుగా తెలుసుకోవాలనే తపన, కొత్త సిద్ధాంతాల అన్వేషణ, ఉన్నత విద్యా రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను శోధించాలనే ఆసక్తి విద్యార్థులను పరిశోధన రంగం వైపు పరుగులు పెట్టిస్తున్నాయి. యూనివర్సిటీల్లో అధ్యాపక ఉద్యోగాలకు పీహెచ్‌డీ డిగ్రీని తప్పనిసరిగా చేయడం కూడా విద్యార్థులు పరిశోధనలపైన ప్రత్యేకంగా దృష్టి సారించేలా చేస్తోంది. ఫలితంగా కేయూలో ఏటా పరిశోధకుల సంఖ్య పెరుగుతోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, నిర్వహణ, ఔషధ రంగం, వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర, ఐటీ, కంప్యూటర్, రసాయనశాస్త్రం, మైక్రోబయోలాజీ, వాణిజ్యరంగం, జీవ సాంకేతిక, విద్యా రంగంలో సంభవిస్తున్న మార్పులు, జంతు, వృక్షశాస్త్రాలు, మేనేజ్‌మెంట్, రాజకీయ పరిణామాలు, సాహిత్యంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ప్రముఖుల జీవితాలపై అధ్యయనాలు, ఆహార ఉత్పత్తులు, జీవన శైలిలో వస్తున్న మార్పులు, మహిళా ఆర్థికాభివృద్ధి, ఇంజినీరింగ్, న్యాయశాస్త్రం, నీటి కాలుష్యం, భూగర్భ జలాల పరిరక్షణ, ఖనిజాల అభివృద్ధి, సహజ వనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, జంతువుల్లో వచ్చే వ్యాధులు, ప్రాణాంతక క్యాన్సర్, హెచ్ఐవీలతో పాటు ఆహార పంటలు, మొక్కలకు సోకే వ్యాధులు, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఆహార పంటల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపైన పరిశోధనలు చేయడానికి విద్యార్థులు తాజాగా ఆసక్తి చూపుతున్నారు. ఈ కోర్సులన్నీ వర్సిటీలో అమల్లో ఉన్నవే. రెండేళ్ల వ్యవధిలో కొందరు, మూడు నుంచి ఐదేళ్లలో మరి కొందరు పరిశోధనలు పూర్తిచేస్తున్నారు. పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్న తరవాత బోధన, పరిశోధన రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవడం ద్వారా ఆయా రంగాల్లో పరిశోధకులు పెరుగుతున్నారు. విశ్వవిద్యాలయంలో అధునాతమైన ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన అధ్యాపకుల అండదండలు పుష్కలంగా ఉండడం, అధికారుల ప్రోత్సాహం పరిశోధనా రంగాన్ని పరుగులు పెట్టిస్తోంది.

గతంలో ప్రవేశాలిలా.. : కేయూలో 1976 నుంచి పీహెచ్‌డీల్లో ప్రవేశాలు ప్రారంభించారు. ప్రస్తుతం 42 పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నా 27 కోర్సుల్లో మాత్రమే పరిశోధనలు చేసే అవకాశం కల్పిస్తున్నారు. మిగతా కోర్సుల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో ఆయా కోర్సుల్లో పరిశోధనలు చేసే అవకాశం లేకుండా పోతోంది. 2009 సంవత్సరం ముందు వరకు కేయూలోని కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలు సులభంగానే ఉండేవి. కేయూ అధికారులు రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ప్రవేశపరీక్షలు లేకుండానే సీట్లిచ్చేవారు. ప్రవేశాలు పొందిన తరవాత ఏడాదికి ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఉండేది అందులో ఉత్తీర్ణత సాధించిన తరవాత రెండేళ్లకు పరిశోధనా గ్రంథాన్ని సమర్పించిన తరవాత వైవా నిర్వహించి డాక్టరేట్ పట్టాను ప్రకటించేవారు.

మారిన నిబంధనలు ఎంతో కఠినం: పీహెచ్‌డీ ప్రవేశాల్ల ఉన్న నిబంధనలను యూజీసీ మార్చివేయగా 2010 నుంచి కేయూలో ప్రవేశపరీక్ష విధానాన్ని అమలుచేస్తున్నారు. ప్రవేశ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా పర్యవేక్షకులను కూడా విశ్వవిద్యాలయమే కేటాయిస్తోంది. ఈ విధానం దేశ వ్యాప్తంగా అమల్లో ఉండడంతో కేయూలో కూడ వర్తింపజేస్తున్నారు. ఆ తరవాత ప్రీ పీహెచ్‌డీ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సిందే. అయితే పరిశోధన గ్రంథాన్ని సమర్పించే ముందు రెండు సెమినార్లు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందాలంటే ఇంటర్వ్యూలు, డిగ్రీ, పీజీల్లో సాధించిన మార్కులను కూడా పరిగణలోకి తీసుకొంటున్నారు. పరిశోధన రంగాన్ని మరింత పటిష్ఠపర్చడంలో భాగంగానే యూజీసీ కఠిన నిబంధనలు అమలు చేస్తుంది. అయినా పరిశోధనలపై మక్కువను పెంచుకునే వారి సంఖ్య పెరుగుతోంది.

2017లో నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలను జూన్‌లో వెల్లడించినా కొంత గందరగోళం ఫలితంగా ప్రవేశాల్లో ప్రతిష్ఠంభన నెలకొంది. కేయూలోని 27 విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకులకు మాత్రమే గైడ్ షిప్‌కు అనుమతి ఉంటుంది. ప్రతి విభాగంలో పనిచేసే అధ్యాపకులు ఒక్కొక్కరు ఆరుగురిని పర్యవేక్షణ చేస్తారు. మొత్తంగా 1000 నుంచి 1200 వరకు సీట్లు అందుబాటులో ఉంటాయి. ప్రతిసారి ఇదే సంఖ్య ఉండదు. మారుతూ వస్తోంది. అధ్యాపకుల వద్ద ఉన్న ఖాళీల ప్రకారం నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్యను పొందుపరుస్తారు. వాణిజ్యశాస్త్రం, రసాయనశాస్త్రంలో అధికంగా విద్యార్థులు ప్రవేశాలు పొందేవారు. ఈసారి మాత్రం పలు కోర్సుల్లో డిమాండ్ నెలకొంది. ఈసారి మొత్తం 7332 మంది ప్రవేశ పరీక్ష రాశారు.



పెరుగుతున్న పరిశోధకుల సంఖ్య

కేయూలోని పలు కోర్సుల్లో పరిశోధకుల సంఖ్య ఏటికేడు పెరుగుతూనే ఉంది. అయితే ప్రతి సంవంత్సరం ప్రవేశపరీక్ష నిర్వహించడం లేదు.

సంవత్సరం	ప్రవేశపరీక్ష రాసినవారు
2010	2505
2012	2705
2013	3034
2017	7332

అవకాశాలు పెరుగుతున్నాయి..

– ఆచార్య వి.రవీందర్ కేయూ ప్రవేశాల విభాగం సంచాలకులు



విద్యార్థుల్లో ప్రస్తుతం పరిశోధనలపై ఆసక్తి పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జేఆర్ఎఫ్, సీఎస్ఐఆర్, ఆర్‌జీఎన్ఎఫ్ లాంటి పలు సంస్థలు పరిశోధకులకు ఐదేళ్ల పాటు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాయి. వీటితో పాటు కేంద్ర పరిశోధన సంస్థల్లో అవకాశాలు పెరుగుతున్నాయి. డాక్టరేట్‌లు పూర్తిచేసిన వారికి పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నెలకు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు జీతభత్యాలు ఇస్తున్నారు. విదేశాలు, విశ్వవిద్యాలయాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పరిశోధనలు పూర్తిచేసిన తరవాత కూడ పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్ కూడ ఉంది. దీనికి ఎంపికైనవారికి నెలకు రూ.35 వేల నుంచి రూ.45 వేల చొప్పున ఐదేళ్ల పాటు ప్రోత్సాహకంగా చెల్లిస్తున్నారు. ఇలా విభిన్న అవకాశాలున్న నేపథ్యంలో పరిశోధనల వైపు విద్యార్థులు దృష్టి పెడుతున్నారు.

బోరుబావే కాదు.. ఈ గుంతా డేంజరే..!

చిన్నారుల పాలిట బోరుబావి గుంతలే మృత్యుపాశాలవుతున్నాయనుకుంటే నేనూ ఉన్నానంటోంది హన్మకొండలోని భవానీనగర్ స్పెక్ట్రా స్కూల్ సమీపంలోని సిమెంట్ రోడ్డు. ఈ రహదారి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. సిమెంట్‌రోడ్డు కింద భూగర్భంలోకి గుంత ఏర్పడింది. ఇదే మార్గంలో నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు వివిధ పాఠశాలలకు వెళ్తున్నారు. వారిని చేయిపట్టి నడిపించే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోతైన గుంతలో కూరుకుపోవాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



– చిత్రం: ఈనాడు, హన్మకొండ

క్రీడా భారతి.. పతకాల హారతి..

న్యూస్‌టుడే, గోపాలపూర్

పట్టుదల, తపన, లక్ష్యంపై గురి ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చనడానికి వయసుతో సంబంధంలేదని నిరూపిస్తున్నారు నగరానికి చెందిన కూరాకుల భారతి. 56 ఏళ్ల వయసులోనూ అంతర్జాతీయ క్రీడల్లో సత్తాచాటి పతకాలు మెడలో వేసుకుంటున్నారు. అథ్లెటిక్స్‌లో ఆమె సాధించని పతకమంటూ లేదు. మైదానంలోకి దిగితే చిరుతలా పరుగులు తీసే భారతి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అన్ని విభాగాల్లోనూ పతకాలను సాధించారు. వివిధ పోటీల్లో 64 బంగారు, 15 రజత, 3 కాంస్య మొత్తం 82 పతకాలు తన ఖాతాలో వేసుకున్నారు. అంతర్జాతీయస్థాయిలోనూ ప్రతిభతో దేశానికి రెండు పతకాలు తెచ్చారు. వయసు పైబడినా సాధన మాత్రం ఆగడం లేదు. త్వరలో చైనాలో జరగబోయే అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు ఆమె సన్నద్ధమవుతున్నారు.

పరుగుల భారతి ఎవరంటే.

భారతి సాధారణ మహిళ కాదు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారి. హన్మకొండలోని రాంనగర్‌లో స్థిరపడిన ఆమె వరంగల్ అర్బన్ జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారిగా పని చేస్తున్నారు. ఒకపక్క ఉద్యోగం మరో పక్క కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే రోజూ ఉదయం మైదానంలో పరుగు సాధన చేస్తు న్నారు. తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్‌లో సంయుక్త కార్యదర్శిగా, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా, ట్రైసిటీస్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా సమాజ సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. భారతి, నారాయణరావు దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వారందరికీ పెళ్లిళ్లు చేశారు. మనవళ్లు, మనవరాళ్లతో హాయిగా కాలం గడిపాల్సిన వయసులో మైదానాల్లో ఉరుకుతుండడం ఆమెలో పట్టుదల, కార్యదక్షతకు నిదర్శనం.

వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రతి రోజు ఒక మైదానానికి వెళ్లి మహిళా వాకర్స్‌ను ఆమె ప్రోత్సహిస్తుంటారు. ప్రతిభగల మహిళలకు శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నారు. ఇలా ఆమె శిష్యులు సైతం రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్నారు.

రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పతకాలు.

కార్మిక శాఖలో ఉద్యోగంలో చేరిన తరవాత 1995లో మొదటిసారి మైదానంలో భారతి అడుగు పెట్టారు. వరంగల్‌లో జరిగిన టీఎన్జీవోస్ జిల్లాస్థాయి క్రీడల్లో పరుగు పందెంలో మొదటి బహుమతి సాధించారు. అప్పుడు ఆమె వయసు 34 సంవత్సరాలు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అథ్లెటిక్స్‌లో వెనుతిరిగి చూడలేదు. మొదటి గెలుపు స్ఫూర్తినివ్వడంతో రోజు పరుగులో సాధన చేస్తున్నారు. 1998లో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (ఎంఏఏ) ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో మొదటిస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించారు. అదే సంవత్సరం మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ముంబైలో జరిగిన జాతీయ స్థాయిలో క్రీడల్లో బంగారు పతకాన్ని సాధించారు. ఇలా వివిధ జాతీయస్థాయి క్రీడల్లో 26 బంగారు పతకాలు, 8 వెండి, క్యాంస పతాలను మెడలో వేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన క్రీడల్లో 38 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, 2 క్యాంస పతాలు సాధించారు.

మలేసియాలో కాంస్యం..

గత నెల 23 నుంచి 24 వరకు అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలేసియాలో జరిగిన అంతర్జాతీయ పోటీలలో భారతదేశం తరుపున పాల్గొని 50 సంవత్సరాల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ట్రిపుల్‌జంప్‌లో రజతం సాధించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జరిగిన పోటీలలో భారతి క్రీడాకారిణిగా హాజరయ్యారు. ఇప్పటికే మూడుసార్లు రాష్ట్ర ఉత్తమ మహిళా క్రీడాకారిణిగా అవార్డులు అందుకున్నారు. ఒక్క అథ్లెటిక్స్‌లోనే కాదు షటిల్, టెన్నీకాయిట్ క్రీడాంశాల్లో సైతం రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించారు.



రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు, పతకాలతో భారతి

సమాజ సేవలోనూ ముందే..

తీరికలేని పనులున్నా సమాజ సేవ చేయడంలో ఆమె ముందు వరుసలో ఉంటున్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి వివిధ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇప్పటివరకు పలుసార్లు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడారు. అనాథ విద్యార్థులు, వృద్ధాశ్రమాలలో పలు రకాలుగా సాయం అందిస్తున్నారు. పచ్చదనం, పరిశుభ్రత కోసం హరిత హారం, స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రధానంగా నగరంలోని మహిళల ఆరోగ్య పరిరక్షణకు రోజూ గంటపాటు నడక ప్రారంభించాలని కోరుతూ చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

56 ఏళ్ల వయసులో క్రీడాకారిణిగా ప్రతిభ

జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో 82 పతకాలు

అంతర్జాతీయ పోటీల్లోను ప్రతిభ

షటిల్, టెన్నీకాయిట్ క్రీడల్లోనూ రాష్ట్రస్థాయిలో రాణింపు



ఇటీవల మలేసియాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించి జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న భారతి

క్రీడారంగంలోకి మహిళలు రావాలి..

– కూరాకుల భారతి, అంతర్జాతీయ క్రీడాకారిణి

క్రీడా రంగంలో మహిళల సంఖ్య తక్కువగా ఉంటోంది. మైదానంలోకి రావాలంటేనే ఇప్పటికీ భయపడుతున్నారు. న్యూనతా భావం అధికంగా ఉంది. అనేక మంది మహిళల్లో క్రీడా ప్రతిభ ఉన్నా వారిని ప్రోత్సహించే వారు ఉండడం లేరు. దీంతో వారి ప్రతిభ కనుమరుగవుతోంది. ఇటీవలి కాలం వరకు ఉదయపు నడకకు రావడానికి ఎక్కువ మంది భయపడేవారు. ఇప్పుడిప్పుడే వారిలో మార్పులు వస్తున్నాయి. వరంగల్ ట్రైసిటీస్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు గోపాల్‌రెడ్డి, దేశిని లక్ష్మీనారాయణ మహిళలను నడిపించడానికి నిరంతరం కృషిచేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీలో మహిళా వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటుచేశాం. పలు సామాజిక ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మరిన్ని మహిళా అసోసియేషన్లు ఏర్పాటుచేస్తాం. నా తరవాత వరంగల్ నుంచి వారసులను తయారు చేస్తున్నాం. మరింత మంది మహిళలు క్రీడాకారులుగా మైదానంలో దిగేలా కృషి చేస్తున్నాను.



రైళ్లలో అక్రమ రవాణా అరికట్టేదెలా?

విజయవాడ-వరంగల్-కాజీపేట మధ్య
రోజూ నడిచే రైళ్లు : 20
నాన్ డెయిలీ రైళ్లు : 10

విజయవాడ- వరంగల్-బల్లార్షా
మార్గంలో రోజూ నడిచేవి : 8
నాన్ డెయిలీ రైళ్లు : 31

వేధిస్తున్న సిబ్బంది కొరత

కాజీపేట, న్యూస్‌టుడే

రైళ్లలో అక్రమ రవాణాను అరికట్టడానికి రైల్వే పోలీసులకు ఒక సవాలుగా మారింది. ఏ మూటలో ఏముందో, ఏ ముఠా వీటి వెనక ఉందో తెలుసుకోవడం కష్టంగా మారింది. దీనికితోడు సిబ్బంది కొరత ప్రభుత్వ రైల్వే పోలీసు, రైల్వే రక్షక దళాలను వేధిస్తుంది. ఉన్న సిబ్బందితోనే సరిపుచ్చుకుంటున్నారు. కొన్ని రైళ్లలో ఏ బోగీని తనిఖీ చేసినా అక్రమ రవాణా బయటపడుతుంది. అంటే ప్రతి బోగీని కూడా దుండగులు తమ అక్రమ రవాణాకు వాడుకుంటున్నారు. గంజాయి, బెల్లం, చౌకబియ్యం, గుట్కాలు, తంబాకు, పాన్‌మసాలా, బంగారం, వెండి, డబ్బులు, ఇలా అనేక రకాలుగా రైళ్లలో అక్రమంగా రవాణా అవుతుంది. ఈమధ్యకాలంలో వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలో రైల్వే పోలీసులు వీటిపై ఎక్కువ దృష్టి పెట్టారు. దీంతో ప్రతి రోజు గంజాయి ఇతర అక్రమ రవాణా కేసులు నమోదవుతున్నాయి. అయినా రవాణా ఆగడంలేదు. దీనిని అరికట్టాలంటే సిబ్బంది కొరత తీరాలి. ఎక్కడైతే వీటిని రైళ్లలో ఎక్కిస్తున్నారో అక్కడి పోలీసులు శ్రద్ధ పెడితే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయొచ్చు.

సిబ్బంది మధ్యసమన్వయ లోపం..

రైళ్లలో జరిగే వివిధ నేరాలను అడ్డుకోవడానికి, ఆస్తుల రక్షణకు ప్రభుత్వ రైల్వే పోలీసు, రైల్వే రక్షకదళం ఉన్నాయి. జీఆర్పీ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండగా, ఆర్పీఎఫ్ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పని చేస్తుంది. రైళ్లలో జరిగే నేరాలను, రైలు కిందపడి మరణించిన వారి కేసులను జీఆర్పీ నమోదు చేస్తుంది. ఆర్‌పీఎఫ్‌కు ఈ అధికారాలు లేవు. వీరు కేవలం రైల్వే ఆస్తుల రక్షణ, ప్రయాణికుల భద్రత, స్టేషన్ల ముందు భద్రత చూస్తుంది. ఆర్‌పీఎఫ్‌కు రైళ్లలో తనిఖీ చేసే అధికారముంది. కానీ దానిని కేసుగా మలచాలంటే జీఆర్పీకే అప్పగించాల్సి ఉంటుంది. జీఆర్పీ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం నుంచి వస్తారు. పైగా ఇది వారికి లూప్‌లైన్ అంటే కొన్ని సందర్భాలలో తప్పనిసరిగా రైల్వేలో పని చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. కొందరూ బలవంతంగా ఈ విభాగంలోకి వస్తే మరి కొందరూ కావాలని కోరుకొని వస్తారు. రైల్వే వీరిపై చిన్న చూపు చూస్తుంది. ఆర్పీఎఫ్‌కు ఇచ్చినన్ని సదుపాయాలు జీఆర్పీ కల్పించదు. కాబట్టి రెండు శాఖల్లో కొంత సమన్వయం ఉండదు. ఇటీవల ఈ రెండు శాఖలు కలిసి పని చేస్తున్నాయి. కాబట్టి ఎక్కువ మొత్తంలో కేసులు నమోదవుతున్నాయి. ఇది మరింత పెరిగితే రైళ్లలో అక్రమ రవాణాను చాలావరకు అరికట్టవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మారుతున్న రవాణా తీరు..

అసలే సిబ్బంది లేమితో బాధపడుతున్న రైల్వే పోలీసుల కన్నులు కప్పడానికి దుండగులు తమ అక్రమ రవాణాను మార్చుకుంటున్నారు. గతంలో సింగరేణిలో బల్లార్షా నుంచి బెల్లం వరంగల్‌కు రవాణా జరిగేది. దీని మీద మంచిర్యాల, కాజీపేట పోలీసులు దృష్టి పెట్టడంతో కొంత మేరకు తగ్గు ముఖం పట్టింది. దుండగులు ఆంధ్రా ప్రాంతం నుంచి పద్మావతి ఎక్స్‌ప్రెస్, గౌతమి ఇలా పలు రైళ్లలో వరంగల్‌కు రవాణా చేయడం ప్రారంభించారు.

కలవరపెడుతున్న గంజాయి..

రైల్వే పోలీసులను గంజాయి రవాణా కలవరపెడుతుంది. ఏ బోగిలో చూసిన ఏదో ఒక సూట్‌కేసులో గంజాయి బయటపడుతుంది. ముఖ్యంగా విశాఖ, విజయనగరం, ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలో (కోణార్క్, దక్షిణ్, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లు) ఎక్కువగా ఉంటుంది. ఈ రైళ్లు వరంగల్, కాజీపేటలో ఒక నిమిషం మాత్రమే నిలుస్తాయి. ఈ సమయంలో 24 బోగీలను ఇందులో ఉండే 1728 మంది (జనరల్‌లో అదనపు ప్రయాణికులు కాక)కి సంబంధించిన సమానులు తనిఖీ చేయడం వీలు కావడం లేదు. సిబ్బంది లేమి ఉన్నా ప్రతి రైలులో ఎస్కార్ట్‌లను నియమించి భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. వీరు రాత్రి పూట లేదా మధ్యాహ్నం రైళ్లలో తిరుగుతూ భద్రత కల్పిస్తారు. వీరు ఇచ్చే సమాచారంతో వీరు చేసిన తనిఖీలతో అక్రమ వస్తువులు బయటపడతాయి. కానీ సిబ్బంది పెరగకుండా ఇటీవలె రైళ్ల సంఖ్య పెరుగుతూ వస్తుంది. దీనికి అనుగుణంగా సిబ్బంది పెరగకపోవడంతో అక్రమ రవాణాదారులకు వరంగా మారుతుంది. సిబ్బంది కొరత తీర్చకపోతే అక్రమ రవాణా ఆగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు (పాత చిత్రం)

ప్రయాణికులే ఉప్పందించాలి

రైళ్లలో రవాణా జరిగే వివిధ వస్తువుల వివరాలను తోటి ప్రయాణికులు గమనించే అవకాశముంది. కాబట్టి వారే పోలీసులకు ఉప్పందించాల్సి ఉంటుంది. ఇది పోలీసులకు సులభమవుతుంది. ప్రస్తుతం రైల్వే ప్రయాణికులకు భద్రత కోసం 182 టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేసింది. దీనికి ఫోన్ చేసి బోగీ నంబరు, వివరాలు తెలిపితే పోలీసులు చూసుకుంటారు. ప్రస్తుతం ఈ విధానం ద్వారానే ఎక్కువగా పోలీసులకు అక్రమ రవాణా వస్తువులు దొరుకుతున్నాయి.

మొదట్లోనే అరికట్టాలి

విజయనగరం, విశాఖ ఏజెన్సీలలో గంజాయి పంటలు ఇష్టం వచ్చినట్టు పండిస్తున్నారు. అక్కడి పోలీసులు ఎక్కువగా ఎర్ర చందనం మీదే దృష్టి పెడుతున్నారు. కానీ గంజాయిని పట్టించుకోవడంలేదు. అక్కడి రైతులకు గంజాయి పంట సాధారణమైంది. ఇది వారికి పెద్ద ఉపాధిగా మారింది. ఇక్కడి నుంచి ముంబయి, ఉత్తర భారతదేశానికి రవాణా చేస్తున్నారు. అక్కడి రైల్వే పోలీసులు దీనిపై దృష్టి పెడితే రైళ్లలో రవాణా తగ్గుతుంది.

పని ఎక్కువ సిబ్బంది తక్కువ..

ప్రభుత్వ రైల్వే పోలీసుకు ఇటీవల రైల్వేలో పని ఎక్కువైంది. అక్రమ రవాణా కారణంగా అనేక కేసులు ప్రతి రోజు నమోదవుతున్నాయి. దీనికితోడు రైళ్ల కింద పడి ఆత్మహత్యలు చేసుకునే కేసులు, రైళ్లలో భద్రత (ఎస్కాటింగ్) విధులు ఎక్కువ కావడంతో సిబ్బంది లేమితో రైళ్లలో తనిఖీలు చేయడం ఇబ్బందిగా మారింది.

కాజీపేట జీఆర్పీ పరిధి కాజీపేట నుంచి ఉప్పల్ కాజీపేట నుంచి జనగామ వరకు ఇందులో ప్రస్తుతం 40 మంది సిబ్బంది ఉన్నారు. సీఐ, ఎస్సై ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 25 కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇక్కడ మరో ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లు కావాల్సి ఉంది.

వరంగల్ రైల్వేస్టేషన్ ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్సైలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 31 మంది కానిస్టేబుళ్లు మొత్తం 42 మంది ఉన్నారు. దీని పరిధి దర్గా కాజీపేట నుంచి గార్ల వరకు ఉంటుంది. ఇక్కడ అదనంగా మరో పది మంది అవసరమవుతారు.

మంచిర్యాల పరిధి ఉప్పల్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ వరకు ఉంటుంది.(ఇది మూడు జిల్లాల పరిధి) ఇక్కడ సీఐ, ఎస్సైతో కలిసి 10 మంది మాత్రమే ఉన్నారు. దీని కింద రామగుండం, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో ఎక్కువ నేరాలు జరిగే అవకాశముంది. కాబట్టి వీటిని పోలీసుస్టేషన్లుగా మార్చాల్సిన అవసరముంది.

డోర్నకల్ ఖమ్మం పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం విజయవాడ, వరంగల్, కాజీపేట మార్గంలో నడిచే రైళ్లలో నేరాలు ఎక్కువ అవుతున్నాయి. ఈ మార్గంలో నడిచే రైళ్లలో ఎక్కువ సిబ్బందిని పెట్టాల్సిన అవసరముంది. రద్దీ సమయంలో (వేసవికాలంలో) అదనపు సిబ్బంది అవసరమవుతారు. ఈ సమయంలో జీఆర్పీ సివిల్ పోలీసుల నుంచి ఏటా 60 మంది సిబ్బందిని డిప్యూటేషన్ మీద తెప్పించుకుంటుంది. వరంగల్, కాజీపేటలో ఆర్పీఎఫ్ సర్కిల్ కార్యాలయాలున్నాయి. వరంగల్‌లో 48 మంది, కాజీపేటలో 52 మంది ఉన్నారు. వీరిలో కూడా సిబ్బంది కొరత ఉంది. జీఆర్పీ సిబ్బంది రైల్వేస్టేషన్‌లో భద్రతతోపాటు, రైళ్లలో భద్రత ఏర్పాటు చేయాలి. దీనికితోడు వీరికి అనేక బాధ్యతలున్నాయి. దీంతో వీరు అక్రమ రవాణాపై దృష్టి పెట్టడం కష్టంగా మారింది.

కాజీపేట జీఆర్పీ స్టేషన్ పరిధిలో సిబ్బంది సంఖ్య : 40	వరంగల్‌లో 42	మంచిర్యాలలో 10	ఆర్‌పీఎఫ్ కాజీపేటలో : 52	ఆర్‌పీఎఫ్ వరంగల్‌లో : 48
కావాల్సిన సిబ్బంది : 9	అవసరమైన వారు : 10	కావాల్సిన వారు : 15	కావాల్సిన సిబ్బంది: 10	అవసరమైన వారు : 12

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మామునూరు, న్యూస్‌టుడే: కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన ఘటనపై మామునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మామునూరు ఎస్సై యుగేందర్ కథనం ప్రకారం.. సంగెం మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన పాశం రాజు(30) కూరగాయల అమ్మకం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 15 ఏళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. గత నెల 25న స్నానం చేసేందుకు వేడి నీళ్లు తోడే క్రమంలో అకస్మాత్తుగా మూర్ఛ రావడంతో వంటిపై వేడి నీరుపడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: గత నెల 7వ తేదీన జఫర్‌గఢ్ శివారు బయ్యన్నగుట్ట మూలమలుపు వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి హైదరాబాద్ ఆసుపత్రిలో మృతి చెందాడని స్థానిక ఎస్సై రాజన్‌బాబు చెప్పారు. ఎస్సై కథనం ప్రకారం.. ‘వరంగల్ శివనగర్‌కు చెందిన గుర్రపు రాకేశ్ (20) తన మిత్రులతో కలిసి గత నెల 7న ద్విచక్రవాహనంపై జఫర్‌గఢ్ నుంచి వర్ధన్నపేటకు వెళ్తుండగా బయ్యన్నగుట్ట వద్ద ఆటోను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి గురైన రాకేశ్‌ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నాం.’

వేధింపులకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఓ యువకుడు డిగ్రీ విద్యార్థిని చరవాణికి అసభ్య సందేశాలు పంపాడు. ఫిర్యాదు అందుకున్న షీ బృందం మహిళా కానిస్టేబుల్ అతడికి ఫోన్‌చేయగా.. ఆమెను సైతం వేధించడంతో అతడిని ఇబ్రహీంపట్నం పోలీసులు బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏసీపీ మల్లారెడ్డి, సీఐ స్వామి వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా పరకాలకు చెందిన బీరం నిఖిల్(24) పదో తరగతి వరకు చదివి జులాయిగా తిరుగుతూ మంచాల మండలానికి చెందిన ఓ విద్యార్థినికి తరచూ అసభ్య సందేశాలు పంపేవాడు. దీంతో ఆమె రాచకొండ షీ బృందం అధికారులకు ఫిర్యాదు చేసింది. షీ బృందం కానిస్టేబుల్ విచారణ నిమిత్తం సదరు యువకుడికి ఫోన్ చేయగా ఆమెను సైతం వేధింపులకు గురిచేశాడు. వారి ఫోన్ నంబర్లతో వేరే మహిళల ఫొటోలు అంతర్జాలంలో ఉంచడంతో ఇబ్రహీంపట్నం ఠాణాలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఎస్ఐలు విజయ్, గోపాల్ నిందితుడిని వరంగల్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఎనిమిది చరవాణులతో ప్రాంతాలు మారుస్తూ.. నాలుగు నెలల నుంచి అసభ్య సందేశాలు పంపుతున్నట్లు గుర్తించారు. నిందితుడు నిఖిల్‌కుమార్‌పై నిర్భయ కేసుతో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ మల్లారెడ్డి వివరించారు.

పేలిన గ్యాస్ సిలండర్

గట్టికల్లు(రాయపర్తి),న్యూస్‌టుడే: గ్యాస్ సిలండర్ పేలడంతో ఇంట్లోని పలు వస్తువులు కాలిపోయిన ఘటన మండలంలోని గట్టికల్లులో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దొనగాని కిష్టయ్య ఇంట్లో కొత్త సిలండర్‌ను తీసుకుని బిగించారు. సాయంత్రం వేలలో పని ముగిసిన అనంతరం వంట చేసేందుకు గ్యాస్ సిలండర్ ఆన్ చేసిన క్రమంలో మంట వచ్చి ఇంట్లోని పలు వస్తువులు కాలిపోయాయి. మంటలు రావడంతో ఇంట్లోని వ్యక్తులు బయటికి వెల్లడంతో భారీ ప్రమాదం తప్పింది.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్యాయత్నం

ఇల్లంద(వర్ధన్నపేట రూరల్), న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఇల్లంద గ్రామానికి చెందిన ఇప్ప మధు(26) గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా కుటుంబ కలహాలు చోటుచేసుకుంటుండడంతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నారు. స్థానికులు స్పందించి మంటలు ఆర్పి, చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

ఏప్రిల్ నెలలో ముఖ్యమంత్రి కేసీఆర్ జనగామ జిల్లా పాలకుర్తిలో పర్యటించారు. వరంగల్ నుంచి రోడ్డు మార్గంలో వెళ్లారు. ఈ సందర్భంగా రహదారులపై చాలా గుంతల్ని గుర్తించారు. హైదరాబాద్‌కు వెళ్లాక రహదారులు, భవనాల శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రహదారులపై గుంతలు కనిపించొద్దు. ఇందుకు నెల రోజుల గడువు ఇస్తున్నా.. గడువులోపు గుంతలు కనిస్తే ఉపేక్షించేది లేదని గట్టి ఆదేశాలు ఇచ్చారు. స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశించినా అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. రహదారులపై ఎక్కడి గుంతలు అక్కడే ఉన్నాయి. ఇందుకు ఉదాహరణ వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారి.



44 కిలోమీటర్లు.. 221 గుంతలు..!

ప్రమాదకరంగా 563వ జాతీయ రహదారి

ఒళ్లు హూనం అవుతుందంటున్న ప్రయాణికులు, వాహనదారులు

మరమ్మతులను పట్టించుకోని అధికారులు

మహబూబాబాద్:(న్యూస్‌టుడే యంత్రాంగం)

మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు, దంతాపల్లి, నర్సింహులపేట, మరిపెడ మండలాల మీదుగా ఖమ్మం వెళుతున్న రహదారిని 'ఈనాడు' పరిశీలించింది. తొర్రూరు నుంచి మరిపెడ వరకు 44 కిలో మీటర్లు ఉంటుంది. రహదారి పొడువునా 221 గుంతలు ఉన్నాయి. అడుగడుగునా గుంతలు ఉన్నాయి. వాటిని తప్పించే ప్రయత్నంలో వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అదేవిధంగా వాహనాలు దెబ్బతింటున్నాయి.

13 ఏళ్ల క్రితం నిర్మాణం

వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిని 13ఏళ్ల క్రితం నిర్మించారు. మొదట్లో రాష్ట్ర రహదారిగా కొనసాగింది. ఏడాది క్రితం 563 జాతీయ రహదారిగా అధికారులు ప్రకటించారు. నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఎన్‌హెచ్ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గుంతలను పూడ్చివేసే పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన జాతీయ రహదారుల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తూతూ మంత్రంగా గుంతలు పూడ్చివేసి.. మమా అనిపిస్తున్నారు.

మరిపెడ కాకతీయ కళాతోరణం నుంచి నాగారం స్టేజీ వరకు 11 కిలోమీటర్ల రహదారిపై 66 గుంతలు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరిపెడ శివారు బక్కరూప్లా తండా వద్ద, ఎల్లంపేట స్టేజీ వద్ద, నీలికుర్తి సమీపంలో, నాగారం స్టేజీ వద్ద పెద్దపెద్ద గుంతలున్నాయి.

నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల పరిధిలో జాతీయ రహదారి 16 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గంలో 133 గోతులు పడ్డాయి. నిత్యం ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతుంటాయి. దంతాలపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో పెద్ద గుంత ఉంది. ఇటీవల అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపేసుకున్నారు. తాజాగా మళ్లీ ఏర్పడింది. నర్సింహులపేట మండలం పడమటిగూడెం స్టేజీ సమీపంలోని రెండు, బీరిశెట్టిగూడెం స్టేజీ సమీపంలలోని రెండు గుంతలు ఉన్నాయి. కంకర తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. వస్రాంతండా తండాకు వెళ్లే దారి సమీపంలో, జగ్గుతండా సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డుపై, పెద్దనాగారం స్టేజీ నీలికుర్తి స్టేజీ తండా వద్ద పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. రాత్రి పూట వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు.

టాస్క్‌ఫోర్స్

తొర్రూరు మండలం పరిధిలో 17 కిలో మీటర్లు ఉంటుంది. మొత్తం 22 గోతులు ఉన్నాయి. వరంగల్ రూరల్ జిల్లా కిష్టాపురం క్రాస్ రోడ్డు నుంచి తొర్రూరు పాల కేంద్రం వరకు అధ్వానంగా ఉంది. సన్నూరు క్రాస్ వద్ద భారీ గుంత ఉంది. ఇక్కడ ఎదురెదురుగా వచ్చే వాహనదారులు కాసేపు ఆగుతున్నాయి.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

గత నెల 14న మరిపెడ కార్గిల్ సెంటర్ డివైడర్ పక్కన ఉన్న గుంతను తప్పించే క్రమంలో 30 మంది ప్రయాణికులతో వెళుతున్న టాటా ఏస్ వాహనం ఏకంగా డివైడర్‌పైకి ఎక్కింది. ప్రయాణికులు గాయాలపాలయ్యారు.

గత నెలలో సన్నూరు క్రాస్ వద్ద ఉన్న భారీ గుంతలో లారీ దిగబడింది. లారీ ముందు చక్రాలు ఊడిపోయాయి. మూడురోజుల పాటు గుంతలోనే కూరుకుపోయింది. ఆ తర్వాత లారీని బయటకు తీశారు. కానీ గుంత వద్ద ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు.

మార్చి 25న కూలీలతో వెళ్తున్న ఆటో తొర్రూరు మండలం వెలికట్టే వద్ద ఉన్న గుంతను తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే నెల 26న నాంచారి మడూరు గ్రామశివారులో కూలీలతో వెళ్తున్న


ప్రమాదానికి గురైన వాహనం (దాచిన చిత్రం)

ఆటో గుంత కారణంగా బోల్తా పడింది.

ఏప్రిల్ 17న తొర్రూరు మండలం హరిపరాలకు చెందిన కోట అహల్య, తన కుమారుడు శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై రాయపర్తి నుంచి రాత్రి సమయంలో ఇంటికి వస్తున్నారు. వెలికట్టే శివారు సన్నూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న జాతీయ రహదారిపై ఉన్న గుంత.. దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ఒక్కసారిగా వాహనం బ్రెక్ వేశాడు. దీంతో వాహనం వెనుక కూర్చున అహల్య కిందపడడంతో తలకు బలమైన గాయం తగిలి.. అక్కడికక్కడే చనిపోయింది.

గుంతల పూడ్చివేతకు టెండర్లు పూర్తి

–కాంతారావు, డీఈఈ, జాతీయ రహదారులశాఖ

ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చివేయడానికి టెండర్లు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పనులు చేయడం లేదు. వర్షాలు తగ్గాక మరమ్మతు పనులు చేపడుతాం. ప్రమాదాలు జరగకుండా చూస్తాం. నూతనంగా రహదారిపై మరో వరస తారు వేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.


తొర్రూరు మండలం మడూరు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలు


నీలికుర్తి స్టేజీ సమీపంలో...

వసతిగృహాల్లో సౌకర్యాల కల్పన


ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

మరిపెడ, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని విద్యార్థి వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం మరిపెడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అవసరమైన సదుపాయాలను గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి నారాయణ స్వామి నేతృత్వంలో ఇంజినీరింగ్ అధికారుల బృందం గుర్తించింది. తాగునీటి సమస్య పరిష్కారం, అదనపు గదుల మరమ్మతు ఇతర వసతిసౌకర్యాల కల్పనకు ప్రతిపాదన రూపొందించారు. జిల్లా పాలనాధికారి ఆదేశం మేరకు నెలకు ఐదు వసతిగృహాల చొప్పున జిల్లాలోని మొత్తం 33 వసతిగృహాలలో సంపూర్ణ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మరిపెడలో గురుకుల డిగ్రీ కళాశాల ప్రారంభం కానుందని చెప్పారు. ఆయన వెంట ఏటీడీవో దేశిరాం, డీఈ నగేష్, ఏఈ పుల్లయ్య, వసతిగృహ సంక్షేమాధికారి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు నరేందర్, గుత్తేదారు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహ అతిథులకు మొక్కల పంపిణీ


అతిథులకు మొక్కలను పంపిణీ చేస్తున్న నూతన వధూవరులు

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: ఆయనో వ్యవసాయాధికారి.. ప్రకృతి అంటే ప్రాణం. తమ వివాహానికి హాజరైన అతిథులకు మొక్కలను అందజేసి పర్యావరణంపై ప్రేమను చాటుకున్నారు. ఈ వినూత్న కార్యక్రమానికి వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం భీమారం పరిధిలోని ఓ ప్రైవేట్ వేడుకల మందిరం వేదికైంది. కాజీపేట సమీప సోమిడి గ్రామానికి చెందిన డాక్టర్ రుద్రోజు విశ్వతేజ్ కరీంనగర్ జిల్లాలో మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్నారు. వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన నవ్యశ్రీ అనే యువతితో బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా వివాహం జరిగింది. పర్యావరణంపై ఉన్న ప్రేమతో వివాహానికి హాజరైన బంధు మిత్రులకు మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారు. పెళ్లికి వచ్చిన సుమారు 500 మంది అతిథులకు స్వయంగా నూతన వధూవరులు మొక్కలు అందజేసి, నాటి సంరక్షించాలని కోరారు. నూతన వరుడు డాక్టర్ రుద్రోజు విశ్వతేజ్ మాట్లాడుతూ ప్రభుత్వ హరితహార లక్ష్యానికి అనుగుణంగా 500 మొక్కలు పంపిణీ చేశామన్నారు. అతిథులకు మొక్కలను అందజేయడం ఆనందానిచ్చిందన్నారు. నేడు తమ స్వగ్రామమైన సోమిడిలో మరో 500 మొక్కలు నాటుతామని తెలిపారు.



ప్రతిభ

ముఖ్యమైన తేదీలు

★ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోస్టులకు: *9 సెప్టెంబరు*
★ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు: *12 సెప్టెంబరు*
★ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, లెక్చరర్ పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు: *15 సెప్టెంబరు*

1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

టీఎస్‌పీఎస్‌సీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు తీపి కబురు ప్రకటించింది. మొత్తం 2345 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ కింద ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం మొదలైన వివరాలు..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మొత్తం ఖాళీలు: 1857
వయసు: 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: రూ.16,400 - 49,870
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం.
చివరి తేదీ: 12 సెప్టెంబరు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు

★ మొత్తం ఖాళీలు: 205.
★ విభాగాల వారీగా ఖాళీలు: అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 41, పీడియాట్రిక్స్ - 27, అనెస్తీషియా - 39, ఆర్థోపెడిక్స్ - 5, ఈఎన్‌టీ - 20, డెర్మటాలజీ - 1, పాథాలజీ - 16, జనరల్ మెడిసిన్ - 34, సైకియాట్రిక్ - 3, రేడియాలజీ - 3, జనరల్ సర్జరీ - 16.
★ అర్హత: సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ/ డిప్లొమా లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: పేపర్ - 1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
✪ పేపర్ - 2లో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి అనే రెండు విభాగాలు ఉంటాయి. సెక్షన్ - ఎలో బేసిక్ యూజీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు (అందరికీ కామన్). సెక్షన్ - బిలో సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
✪ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 90
★ అర్హత: అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా ఏదైనా డిగ్రీ లేదా బోటనీ/ ఫారెస్ట్రీ/ హార్టికల్చర్/ జువాలజీ/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జియాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా కెమికల్/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 31 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.21,230 - 63,010
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయి.
చివరి తేదీ: *12 సెప్టెంబరు*

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 67.
★ అర్హత: అగ్రికల్చర్/ బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజినీరింగ్ (అగ్రికల్చర్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ వెటర్నరీ సైన్స్/ జువాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.31460 - 84970
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: జనరల్ ఇంగ్లిష్ పేపర్ (100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100), మ్యాథమెటిక్స్ పేపర్ (ఎస్ఎస్‌సీ/ హయ్యర్ స్కూల్ స్టాండర్డ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100)లో సాధించిన మార్కులను క్వాలిఫయింగ్ మార్కులుగా పరిగణిస్తారు. 150 మార్కులకు జనరల్ స్టడీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. ఆప్షనల్ పేపర్‌లో (ఏదైనా ఒకటి మాత్రమే) 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మరో 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 12 సెప్టెంబరు

ట్యూటర్

★ మొత్తం ఖాళీలు: - 65
★ విభాగాల వారీగా ఖాళీలు: క్లినికల్ - 33. ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ నాన్ - క్లినికల్ - 32. ఎంబీబీఎస్/ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.(మెడికల్ స్పెషాలిటీ విభాగాల్లో)
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఉద్యోగాలు Jobs

★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
★ పేపర్ - 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ పేపర్ - 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 43.
★ అర్హత: ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,780
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. సమయం: రెండున్నర గంటలు, మార్కులు 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు: 300. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
చివరి తేదీ: *15 సెప్టెంబరు*

డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 10.
★ అర్హత: బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ స్టేట్ డెంటిస్ట్స్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌లో లేదా ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో డెంటల్ సర్జరీకి సంబంధించి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

లెక్చరర్లు

★ మొత్తం ఖాళీలు: 6
★ విభాగాలు: రేడియోలాజికల్ ఫిజిక్స్ ఫిజిస్ట్
★ అర్హత: ప్రథమశ్రేణి మార్కులతో ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ. 37,100 - 91,450
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
పేపర్ – 2: పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా స్థాయిలో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్‌కు సంబంధించి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

★ ఖాళీలు: 2
★ అర్హత: ఫిజియోథెరపీలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.17,890 - 53,950
★ ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
★ పరీక్షా విధానం: మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి.
పేపర్ 1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు 150. సమయం: రెండున్నర గంటలు.
పేపర్ 2: ఫిజియోథెరపీ (డిప్లొమా స్థాయిలో) నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు 150.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
చివరి తేదీ: *15 సెప్టెంబరు*
వెబ్‌సైట్: www.tspsc.gov.in

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✪ ఖాళీలు: హిస్టరీ, ఆర్కియాలజీ - 1.
✪ తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజెస్ - 1.
✪ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ - 1.
✪ సోషియాలజీ, సోషల్ వర్క్ - 1.
✪ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఛైర్ - 1.
✪ జువాలజీ - 1.
✪ బోటనీ, మైక్రోబయాలజీ - 1.
✪ మ్యాథమెటిక్స్ - 1.
✪ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ - డీన్ - 1.
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 'రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాగార్జున నగర్ - 522510, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్' పేరిట ఎస్‌బీఐలో తీసిన రూ.2 వేల డీడీ జతచేసి పంపాలి.
చివరి తేదీ: 9 సెప్టెంబరు
వెబ్‌సైట్: www.anu.ac.in

బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✪ వివరాలు: ఆర్ట్స్: ప్రొఫెసర్ (లా - 1, సోషల్ వర్క్ - 1)
✪ సైన్స్: ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ - 1, మ్యాథమెటిక్స్ - 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 1).
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000
చివరి తేదీ: *29 ఆగస్టు*
✪ **వెబ్‌సైట్: www.brau.edu.in**

ఐఐఎం, విశాఖపట్నం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీ చేయనుంది.
✪ ఖాళీలు: అకౌంటెంట్ -1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) -1, జూనియర్ ఇంజినీర్ -1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫో అసిస్టెంట్ - 1, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్ - 1.
వెబ్‌సైట్: www.iimv.ac.in

IBPS - RRBs Recruitment


No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

(37 – 39):




37. I. ✔ II. ✔
Both I and II follows.

38. I. ✔ II. ✕
Only I follows.

39. I. ✕ II. ✕
Neither I nor II follows.

40.



I. ✕ II. ✔
Only II follows.

41. 8×20 men = 8×32 women
$\Rightarrow$ 5 men = 8 women
5 men + 8 women = 16 women
$M_1D_1 = M_2D_2$
$\Rightarrow 8 \times 32 = 16 \times D_2$
$\Rightarrow D_2 = \frac{8 \times 32}{16} = 16$ days

42. Side of the square
$= \sqrt{1024} = 32$ cm.
$\therefore$ Length of rectangle
$= 2 \times 32 = 64$ cm.
Breadth of rectangle = 32 – 12 = 20 cm.
$\therefore$ Required ratio = 64 : 20 = 16 : 5

43. $x + x + 2 + x + 4 + x + 6 + x + 8 = 220$
$\Rightarrow 5x + 20 = 220 \Rightarrow x = 40$
Second lowest number of different set
$= 2 \times 40 - 37 = 43$
$\therefore$ Required sum
$= 42 + 43 + 44 + 45 + 46 = 220$

44. Bus fare = Rs. 420
Train fare $= 2 \times 420 \times \frac{3}{4}$ = Rs. 630
$\therefore$ Required total fare
$=$ Rs. $(2 \times 420 + 4 \times 630)$ = Rs. $(840 + 2520)$
= Rs. 3360

45. Speed of tractor $= \frac{360}{12} = 30$ kmph
Speed of jeep $= 30 \times \frac{250}{100} = 75$ kmph
$\therefore$ Speed of car $= \frac{3}{5} \times 75 = 45$ kmph
$\therefore$ Average speed of car and jeep together
$= \left(\frac{75 + 45}{2}\right)$ kmph = 60 kmph

46. Gita's average earnings
$= \frac{140 + 200 + 420 + 400}{4} = \frac{1160}{4}$ = Rs. 290

47. Amount earned by Rahul and Naveen
= 180 + 260 + 340 + 160 = Rs. 940

48. Naveen's total earnings on Wednesday
= 420 + 120 = Rs. 540

49. Required difference = 240 – 200 = Rs. 40

50. Required ratio = 360 : 120 : 160
= 9 : 3 : 4

51. It is obvious from the table.

52. Percentage increase in 2006
$= \frac{-12.5 - 5.3}{5.3} \times 100 = 136$

53. Required difference
$= (14.5 - 6.6) \times 1000$ = Rs. 7900

54. Total monthly rent at Virar over the years
$= (1.1 + 2.1 + 1.8 + 3.6 + 5.5 + 7.8) \times 1000$
= Rs. 21900
$\therefore$ Required percentage $= \frac{9800}{21900} \times 100 = 45$

55. It is obvious from the table.

56. I. $5x^2 - 18x + 9 = 0$
$\Rightarrow 5x^2 - 15x - 3x + 9 = 0$
$\Rightarrow 5x(x - 3) - 3(x - 3) = 0$
$\Rightarrow (x - 3)(5x - 3) = 0$
$\therefore x = 3$ or $\frac{3}{5}$
II. $20y^2 - 13y + 2 = 0$
$\Rightarrow 20y^2 - 8y - 5y + 2 = 0$
$\Rightarrow 4y(5y - 2) - 1(5y - 2) = 0$
$\Rightarrow (4y - 1)(5y - 2) = 0$
$\therefore y = \frac{1}{4}$ or $\frac{2}{5}$
Clearly, $x > y$

57. I. $x^3 = 878 + 453 = 1331$
$\therefore x = \sqrt[3]{1331} = 11$
II. $y^2 = 82 + 39 = 121$
$\therefore y = \sqrt{121} = \pm 11$
$\therefore x \geq y$

58. I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$
$\Rightarrow 3 + 4 = x \Rightarrow x = 7$
II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$
$\Rightarrow y^{7/2} = 7^{7/2} \Rightarrow y = 7$
$\therefore x = y$

59. I. $9x - 4x = 54.55 + 15.45$
$\Rightarrow 5x = 70 \Rightarrow x = 14$
II. $\sqrt{y + 155} = 7 + 6 = 13$
$\Rightarrow y + 155 = 169$
$\Rightarrow y = 169 - 155 = 14$
$\therefore x = y$

60. I. $x^2 + 11x + 30 = 0$
$\Rightarrow x^2 + 6x + 5x + 30 = 0$
$\Rightarrow x(x + 6) + 5(x + 6) = 0$
$\Rightarrow (x + 5)(x + 6) = 0$
$\therefore x = -5$ or -6
II. $y^2 + 7y + 12 = 0$
$\Rightarrow y^2 + 4y + 3y + 12 = 0$
$\Rightarrow y(y + 4) + 3(y + 4) = 0$
$\Rightarrow (y + 3)(y + 4) = 0$
$\therefore y = -3$ or -4
Clearly, $x < y$

61. The pattern of the number series is :
$7 \times 2 + 6 = 20$; $20 \times 2 + 6 = 46$
$46 \times 2 + 6 = 98$
$98 \times 2 + 6 = 202$
$202 \times 2 + 6 = 404 + 6 = \boxed{410}$

Send your feedback to
pratibhadesk@eenadu.net

62. The pattern of the number series is :
$210 - 1^3 = 209$
$209 + 2^2 = 213$
$213 - 3^3 = 186$
$186 + 4^2 = 202$
$202 - 5^3 = 202 - 125 = \boxed{77}$

63. (5) The pattern of the number series is :
27 + 11 = 38
38 + 33 = 71
71 + 55 = 126
126 + 77 = 203
$203 + 99 = \boxed{302}$

64. (3) The pattern of the number series is :
$435 - 9 \times 9 = 354$
$354 - 9 \times 8 = 282$
$282 - 9 \times 7 = 219$
$219 - 9 \times 6 = 165$
$165 - 9 \times 5 = \boxed{120}$

65. (3) The pattern of the number series is :
$4 + 14^2 = 4 + 196 = 200$
$200 + 13^2 = 200 + 169 = 369$
$369 + 12^2 = 369 + 144 = 513$
$513 + 11^2 = 513 + 121 = 634$
$634 + 10^2 = 634 + 100 = \boxed{734}$

Calculations (66 – 70):
$\therefore$ 25% = 75
$\therefore$ 100% $= \frac{75}{25} \times 100 = 300$
$\therefore$ Total females = 300
Computer Science $\Rightarrow \frac{300 \times 35}{100} = 105$
Civil Engineering $\Rightarrow \frac{300 \times 5}{100} = 15$
Electrical Engineering $\Rightarrow \frac{300 \times 20}{100} = 60$
Mechanical Engineering $\Rightarrow \frac{300 \times 15}{100} = 45$
Bio-technology = 75
Total males = 700 – 300 = 400
Computer Science $\Rightarrow \frac{400 \times 30}{100} = 120$
Civil Engineering $\Rightarrow \frac{400 \times 15}{100} = 60$
Electrical Engineering $\Rightarrow \frac{400 \times 18}{100} = 72$
Mechanical Engineering $\Rightarrow \frac{400 \times 12}{100} = 48$
Bio-technology $= 400 \times \frac{25}{100} = 100$

66. Required percent $= \left(\frac{100 - 75}{75}\right) \times 100$
$= \frac{100}{3} = 33\frac{1}{3}\%$

67. Required ratio = 120 : 105 = 8 : 7

68. Required difference
= 72 + 48 – 60 – 45 = 15

69. Civil Engineering + Computer Science :
Total students = 105 + 15 + 120 + 60 = 300
Male students = 180
$\therefore$ Required percent $= \frac{180}{300} \times 100 = 60$

70. Required average
$= \frac{45 + 75 + 48 + 100}{2} = \frac{268}{2} = 134$

71. ? = 466 + 765 – 212 = 1019
$\therefore$ Required answer = 1020

72. $? = \frac{150 \times 150}{100} + 150$
= 225 + 150 = 375

73. $? = \frac{300 \times 750}{1000} - 1400$
= 2250 – 1400 = 850

74. ? = 51 – 34 + 21 = 38
$\therefore$ Required answer = 40

75. $? = \frac{900}{30} \times \frac{90}{300} \times \frac{600}{50} = 108$
$\therefore$ Required answer = 110

76. C.P. of wrist watch
$= \frac{100}{100 - \text{loss\%}} \times$ S.P.
$=$ Rs. $\left(\frac{100}{75} \times 2400\right)$ = Rs. 3200
$\therefore$ Required S.P. of wrist watch =
Rs. $\left(\frac{125}{100} \times 3200\right)$
= Rs. 4000

77. Fifth number
$= 5 \times 56 - 4 \times 54 = 280 - 216 = 64$

78. Let the number be x.
$\therefore x + \frac{7}{9} \times \frac{35}{100} \times 900 = 325$
$\Rightarrow x + 245 = 325$
$\Rightarrow x = 325 - 245 = 80$

79. x + 4x + 5x + 60 = 360"
$\Rightarrow 10x = 300° \Rightarrow x = 30$
$\therefore$ Required difference = 5x – x
$= 4x = 4 \times 30 = 120$"

80. On dividing 1740 by 88,
the remainder = 68
$\therefore$ Required number = 68.

This model paper was prepared by subject experts of RACE Institute, Hyderabad

ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కింది పోస్టులను భర్తీ చేయనుంది.


- ✪ ఖాళీలు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (న్యూక్లియర్) - 1.
- ✪ జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డీ) - 1.
- ✪ డిప్యూటీ జనరల్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ) - 1.
- ✪ పర్చేజ్ మేనేజర్ - 3.
- ✪ ఈసీఐఎల్ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది. వీటిని బధిరులకు కేటాయించారు.
- ✪ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ - 1
- ✪ అకౌంట్స్ ఆఫీసర్ - 2. ✪ పర్సనల్ ఆఫీసర్ - 2.
- ✪ ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
- ✪ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✪ చివరి తేదీ: *31 ఆగస్టు*

వెబ్‌సైట్: **careers.ecil.co.in**

హాయ్! బుజ్జీ!!

కొండల్లో ఇల్లంట.. ప్రపంచంలో మిన్నంట!!



ప్రపంచంలో ఎత్తయిన ఆకాశహర్మ్యం ఏదంటే... బుర్జ్‌ఖలీఫా అని టక్కున చెప్పేస్తాం. మరి ప్రపంచంలో ఎత్తయిన ఇల్లేదంటే చెప్పగలరా? తెలియకపోతే ఇది చదివేయాల్సిందే.

- మనం పది పదిహేను అంతస్తులుండే అపార్ట్‌మెంట్లు బోలెడు చూస్తుంటాం. అందులో చాలా కుటుంబాలు నివాసముంటాయి. అయితే ప్రపంచంలో ఒకే కుటుంబం ఉండే ఎత్తయిన ఇల్లొకటుంది. పేరు 'ఫాల్కన్ నెస్ట్'.
- అమెరికాలో ఆరిజోనా రాష్ట్రం ఉంది. అక్కడన్నీ చాలామటుకు రాతి కొండలు. అలాంటి చోటుందీ ఇల్లు.
- ఇది 6,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 10 అంతస్తుల్లో ఉన్న దీని ఎత్తు 124 అడుగులు. అంటే ఓ పన్నెండు అంతస్తుల అపార్ట్‌మెంట్ అంత.
- ఈ ఇంట్లోంచి 360 డిగ్రీల్లో చూట్టూ ఏ ప్రదేశమైనా చక్కగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆరిజోనా పక్క రాష్ట్రం కాలిఫోర్నియాలోని పర్వతాలు సైతం ఈ ఇంట్లోకి కనిపిస్తాయి. దీని నిర్మాణమే ఆ రకంగా చేశారన్నమాట.
- ఇంత పెద్ద ఇంట్లో బోలెడన్ని పడకగదులు ఉంటాయనుకుంటారేమో. దీంట్లో ఉన్నది మూడు పడకగదులు, నాలుగు బాత్రూమ్‌లే. మిగిలిన స్థలమంతా బయటి ప్రకృతి అందాలు ఎక్కడికక్కడ కనిపించేలా అద్దాలతో ఉంటుంది.
- ఇల్లు వేసవిలో చల్లగా, శీతకాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంది.
- దీని యజమాని ఎంతో ఇష్టంతో 1994లో దీన్నిలా కట్టించుకున్నారు. ఆయన భార్య చనిపోవడంతో ఇప్పుడు దీన్ని అమ్మకానికి పెట్టారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఇల్లు అమ్మకానికి వచ్చిందంటూ ఇది ఇప్పుడు మళ్లీ వార్తల్లోకొచ్చింది.



మన జీవిత లక్ష్యం ఆనందం కాదు, దానికి తగిన అర్హత సంపాదించుకోవడం

– ఎమర్సన్

పదసంపద!



రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- push = తోయు
- మకరం = మొసలి

కథ



ధ్రువ ప్రాంత ఎలుగుబంట్లు వాసన చూడటంలో మహా దిట్టలు. ఆహారం మంచులో దాగి ఉన్నా ఇవి 20 మైళ్ల దూరం నుంచే పసిగట్టేస్తాయి.

నోటు పాట్లు!

ఒక అరటి పండ్లు అమ్మే వాడి డబ్బుల డబ్బాలోకొచ్చి పడిందో పది రూపాయల కాగితం. సరికొత్తగా మెరిసిపోతోంది. అయితే దాని ముఖంలో విచారం పరుచుకుని ఉంది.

ఆ డబ్బాలో ఉన్న మిగతా డబ్బు కాగితాలు, నాణేలు మొదట ఈ కొత్త నేస్తాన్ని కుతూహలంగా చూశాయి. దాని దిగులు ముఖం చూసి ఏమైందని అడిగాయి.

"ఊహ తెలిసినప్పటి నుంచి ఒక ఇనుప పెట్టెలో ఊపి రాడక బతికాను. ఈ రోజు ఒక షావుకారు దయవల్ల బయట పడ్డాను. ఊపిరి పీల్చుకోబోయానో లేదో అతగాడు నన్ను ఒక బిచ్చగత్తె జోలెలో పడేశాడు. ఆమె దగ్గరున్న సొట్టలు పడిన సత్తు గిన్నెలోకి చేరుకున్నాను. అలాంటి చోట బతకాలంటే ఎంత కంపరమనిపించిందో. ఇంతలో ఆమె అరటిపండ్లు కొనడంతో మళ్లీ ఈ పెట్టెలో కొచ్చి పడ్డాను. మళ్లీ చీకటి, ఇరుకు, ఉక్కపోత. ఇక్కడి నుంచి ఎవడి చెమట జేబులోకి వెళ్తానో, వాడు నన్ను ఎవరి పరం చేస్తాడో, ఇలా ఎన్ని చేతులు మారాలో తలుచుకుంటేనే గాబరాగా ఉంది". అని వాపోయింది.

పక్క డబ్బులన్నీ దీని వాలకానికి నిరుత్సాహ పడ్డాయి. ఇక దాని జోలికి పోకుండా తమలో తాము కబుర్లాడుకోసాగాయి.

ఇంతలో ఆ పెట్టెలోకి చేరింది మరో పది కాగితం. చాలా ముడతలు పడి మురికిగా, చిరగడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. అయితే దాని ముఖం కళకళలాడుతోంది. వచ్చిన కాసేపటికే అన్ని రకాల డబ్బులనూ నవ్విస్తూ వాటికి మంచి నేస్తమయిపోయింది.

ఈ కొత్త కాగితాన్ని కూడా పలకరించింది. కానీ అది నవ్వలేదు సరికదా! మరింత ముఖం ముడుచుకుని 'మాసిపోయిన నీ వాలకం చూస్తుంటే కొన్నాళ్లకి నా గతీ ఇంతేనేమో అని ఏడుపొస్తోంది' అంది దీనంగా.

నవ్వుతూ వింటున్న పాత నోటుని నీకథేమిటంది ఆగలేక.

'మొదట నేనూ కొన్నాళ్లపాటు ఇనపపెట్టెలో ఊపిరాడకుండానే ఉన్నాను. కానీ ఒక కుటుంబానికి భద్రతనిస్తున్నాననే ఆనందంతో బాధ అనిపించలేదు. ఈ రోజు ఒక చెప్పులు కుట్టే మనిషి చేతికి వచ్చాను. ఇందాక అతను తన వణుకుతున్న చేతులతో చెమటతో తడిచిన జేబులోంచి నన్ను తీసి ఇచ్చి అరటిపళ్లు కొని ఒకటి ఆత్రంగా తిన్నాడు. అతని ఆకలి తీర్చగలిగాననే ఆనందం ఎంత బాగుందో! ఎండరివో చెమట, మురికి అంటుకుని ఇలా అయిపోయాను. నా జీవితంలో ఎన్ని మలుపులో! ఎన్ని మజిలీలో! అయినా నాకు అడుగడుగునా ఆనందమే'. చెబుతున్న పాత నోటును ఒక చెయ్యి పైకి లాగింది.

'మరెవరి అవసరమో తీర్చే అవకాశం మళ్లీ వచ్చింది నాకు. టాటా' అని వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయింది పాత నోటు.

అసలైన ఆనందం తారసపడిన పరిస్థితుల్ని బట్టి కాదు, అలవరుచుకున్న వైఖరిని బట్టి ఉంటుందని తెలుసుకుంది కొత్తనోటు. దాని మనసు కలత తీరి తేటపడింది.

- గుడిపూడి రాధికారాణి



నవ్వుల జల్లులు!



టీచర్: హోంవర్కులో ఎవరైనా తప్పులు చేస్తే వాళ్లకు రేపు గట్టిగా దెబ్బలు పడతాయి...

చింటు: అయితే రేపు మా అన్నను తప్పకుండా తీసుకొస్తాను టీచర్!

- జీవీయస్ ప్రియంవద, అరసవెల్లి

భార్య: ఏవండీ నేనీరోజు గారెలు చేశాను...

భర్త: అయితే పళ్ల డాక్టరు అపాయింట్‌మెంట్ తీసుకొస్తాను..



భార్య: ఎందుకండీ?

భర్త: అవి తిన్నా, తినకపోయినా తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు కాబట్టి!

- అంజి, చౌడేపల్లి

జతపరచండి!

ఇక్కడ సినిమా పేర్లు అసంపూర్ణంగా ఉన్నాయి. పక్కనున్న పదాల్లో ఏది సరిపోతుందో కనిపెట్టి జత చేయగలరా?


1. స్వామి	ఎ. కోరి
2. ఇట్లు	బి. వేడుక చూద్దాం
3. రారండోయ్	సి. రారా
4. నిన్ను	డి. శ్రావణి సుబ్రమణ్యం

చిలిపి ప్రశ్న

రాత్రిళ్లు కూడా పగలు కనిపించేదెప్పుడు?

- ఎ. వెంకట అమ్మిరాజు, పేరూరు

దారేది?



గబగబా అనండి

నత్త నడక
చిరుత ఉరక

- ఎం.సాయిచేతన్, హైదరాబాద్

ఏది భిన్నం?







ఎవరు నేను?

నేను ఏడక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలో 1,3,6,7 అక్షరాలు కలిపితే పద్యం అని అర్థం, 2,3,5,6– పాత్ర, 7,3,4– గుంపు అని అర్థం. ఇంతకీ నేనెవరిని?

1	2	3	4	5	6	7

జవాబులు: **చిలిపి ప్రశ్న:** కలగన్నప్పుడు! **ఏది భిన్నం:** C **జతపరచండి:** 1.సి 2.డి 3.బి 4.ఎ **ఎవరు నేను:** Problem

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.3లక్షల విలువైన రాగి తీగ, 29సెల్‌ఫోన్‌లు స్వాధీనం

బయ్యారం, న్యూస్‌టుడే: ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న రెండు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలను బయ్యారం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తితో పాటు సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న మరో వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి దొంగలముఠా వివరాలను వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన కందుకూరి అనిల్‌కుమార్ ఎలక్ట్రికల్ డిప్లొమా చేసి ఎలక్ట్రికల్ దుకాణంలో కొంతకాలం పనిచేశాడు. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే విలువైన రాగిని దొంగిలించడం ప్రారంభించాడు. ఇతనితోపాటు ఇల్లెందు మండలం మర్రిగూడేనికి చెందిన కుంజ శేఖర్ సాయంతో మహబూబాబాద్, వరంగల్, భద్రాదీకొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని గ్రామాల్లో సుమారు 59విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసి కాపర్ దొంగిలించాడు. ఈ తీగను తీయడానికి ప్రత్యేక పరికరాన్ని తయారు చేసుకొని చోరీ చేసిన కాపర్‌తీగను బిల్లలుగా మార్చి అమ్మకాలు చేపట్టడం ప్రారంభించాడు. తనసొంత ఆటోలో ఈ కాపర్ బిల్లలను తరలిస్తూ విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న గార్ల ఎస్సై వంశీధర్ అనుమానాస్పదస్థితిలో బుధవారం ఆటో కనిపించింది. దీంతో ఆటోను నిలిపి పరిశీలించగా దొంగతనంగా తరలిస్తున్న సుమారు 6క్వింటాల కాపర్ బిల్లలు కనిపించాయి. దీంతో ఎస్సై వంశీధర్ ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై విచారించగా నాలుగు జిల్లాల్లో 59విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసినట్లు వెల్లడైంది. వారి నుంచి సుమారు రూ.3లక్షల విలువైన 6క్వింటాల కాపర్‌బిల్లలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాపర్‌వైర్‌ను తరలిస్తున్న అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కుంజ శేఖర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై మహబూబాబాద్ జిల్లాలో 22చోరీ కేసులు, ఖమ్మంలో 6కేసులు, భద్రాద్రి కొత్తగూడెంలో 30కేసులు, వరంగల్ జిల్లాలో ఒక చోరీ కేసు... ఇలా మొత్తం 59చోరీ కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రాజమహేంద్రనాయక్, గార్ల, బయ్యారం సీఐ సాంబయ్య, ఎస్సై వంశీధర్, సిబ్బంది ఉన్నారు.

చెడు వ్యవసనాలకు అలవాటై... సెల్‌ఫోన్ చోరీలు

చెడు వ్యసనాలకు బానిసై సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన దాట్ల మధుసూదన్ చెడు వ్యసనాలకు అలవాటుపడి సెల్ దొంగతనాలను ప్రారంభించాడు. ఇతడు అత్యంత చాకచక్యంగా సెల్‌ఫోన్‌లను చోరీలను కొనసాగిస్తూ వస్తున్నాడు. రైళ్లలో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులను పరిచయం చేసుకొని వారి నుంచి మా యింటికి ఒకఫోన్ చేసుకుంటానని నమ్మించి ఫోన్ మాట్లాడుతూ పరారయ్యే వాడు. ఇలా సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడుతూ మహబూబాబాద్‌లోని సెల్‌దుకాణాల్లో తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. అంతేగాక సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న మధుసూదన్‌కు ఆ గ్రామానికి చెందిన ప్రవీణ్, వర్మ, ఉపేందర్, వీరబాబు, మహేశ్‌లతోపాటు మరో ముగ్గురు యువకులు దొంగతనాలకు అవసరమైన పెట్టుబడి పెట్టేవారు. ఇలా పెట్టుబడి పెడుతున్న వారు దొంగతనంగా తెచ్చిన సెల్‌ఫోన్‌లను తక్కువ ధరకు తీసుకునేవారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా కనిపించిన మధుసూదన్‌ను పోలీసులు పట్టుకొని విచారించగా సెల్‌ఫోన్ చోరీకి పాల్పడుతున్న వ్యక్తిగా వెల్లడైంది. అతని నుంచి సుమారు రూ.3లక్షల విలువైన 29సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

జిల్లా సరిహద్దులను పరిశీలించిన ఎస్పీ

మహబూబాబాద్ జిల్లా సరిహద్దు మండలమైన బయ్యారం ప్రాంతంలో జిల్లా పోలీసు సరిహద్దు ప్రాంతాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి బుధవారం పరిశీలించారు. గతంలో ఉన్న సరిహద్దుల్లో స్వల్ప మార్పులు జరిగినట్లు ఎస్పీ తెలిపారు. ఇల్లెందు, బయ్యారం మండల సరిహద్దు నామాలపాడు సమీపంలోని పోలీసు సరిహద్దు మరో కిలోమీటర్ దూరం పెంచిన ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. బయ్యారం, మహబూబాబాద్ సరహద్దులో ఉన్న పాకాలవాగు వంతెన బయటభాగం దాకా బయ్యారం పోలీసు పరిధికి వస్తున్నట్లు తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శిరిడిసాయి అనుగ్రహం కోసం గురువారం పాటించాల్సిన నియమాలు...?, ఇంట్లో ఉండాల్సిన లక్ష్మీప్రదమైన వస్తువులు.., 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: జగన్మోహిని (నరసింహరాజు, ప్రభ).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': ఘుమ ఘుమలు 'చెనా బీట్‌రూట్ మసాలా', మీచేతి వంట 'పాలక్‌పకోడీ కర్రీ', 'బీరకాయ బొబ్బర్ల కర్రీ', జస్ట్ ఎ మినిట్ 'క్యాబేజ్ శాండ్‌విచ్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జీన్స్–2(రిపీట్), 05-30: ఆడాళ్ళా మజాకా: (రావులపాలెం అతివల అల్లరి ఆటల సందడి), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ (ఖతర్నాక్ కామెడీ షో): వినోదాల విందు... 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డీజే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డీజే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ.09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ.10:00, మ. 2:30, రా. 9:30).
విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగల దోపిడి (కృష్ణ, దీప), 10-00: మార్నింగ్ షో: అమ్మో బొమ్మ (రాజేంద్ర ప్రసాద్, ఉమా శంకరి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: వంశానికొక్కడు (బాలకృష్ణ, ఆమని), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: దేవా ది గ్రేట్ (సత్యరాజ్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పంతాలు – పట్టింపులు (శోభన్‌బాబు, వాణిశ్రీ), 10-00: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఎగ్ ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ సలాడ్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఓట్స్ అండ్ వెజిటబుల్ బాత్ & ఓట్స్ లీఫీ అండ్ ఆలూ పరోటా, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చల్ల ఉండలు & స్వీట్ పనియారం, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – మంగుళూర్ బన్స్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – పాలక్ రాజ్మా కర్రీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - సగ్గుబియ్యం పెరుగు వడలు & టమోట రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (గోవన్ – హిందు క్యూసైన్) - గోవన్ కోకోనట్ కేక్, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – పాలకాయలు, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - పొట్లకాయ వడ కర్రీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఆచారి రోస్టెడ్ చికెన్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) – ఆహతీర్ తుకా హష్య & బోహేమనియన్ డ్రెస్సింగ్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - శెనగల బిళ్ళల కర్రీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – తెరియాకి చికెన్, మ.2.30: చోటా షెఫ్ – ఎగ్ పకోడి, సా.5.15: స్నాక్స్ – టమాటో పాస్తా.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 0, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 0, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: కడుపులో సునామీ... **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థ యాత్ర: శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సుజాతానగర్, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 0, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 0, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 0, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, దేశ్‌ముఖ్, రంగారెడ్డి జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: కడుపులో సునామీ... 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 0, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

జొన్న సాగులో మెలకువలు



జొన్నను ఖరీఫ్ పంటగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో విత్తుకోవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి హారిక తెలిపారు. నల్లరేగడి, తేలికైన ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయన్నారు.

రకాలు: సి.ఎస్.హెచ్-5, 6, 9, 13, పి.ఎస్.హెచ్-1, ఎ.ఎస్.హెచ్-1, పి.ఎస్.వి-1, సి.ఎస్.వి-15, నంద్యాల తెల్లజొన్న 3, ఎన్.జె -2169, ఎ.జె-140 తీపిజొన్న రకాలు విత్తవచ్చు. 105 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 15-20 కింటాళ్ల దిగుబడి వస్తుంది. సి.ఎస్.హెచ్ 5, 6, 9, 13 రకాల్లో కంకి కండె ఆకారంలో ఉండి బూజు తెగులు తట్టుకొంటాయి. అంతర పంటలను వేసుకోవచ్చు. ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. చొప్ప ఎక్కువగా వస్తుంది. కాండం తొలుచు పురుగును కొంత వరకు నివారిస్తుంది. గింజ తెల్లగా ఉంటుంది.

విత్తనం: ఎకరాకు 4 కిలోలు సరిపోతుంది.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే ఎడం : వరుసల మధ్య 45 సెం.మీ, వరుసలో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి.

ఎరువులు: పశువుల ఎరువు ఎకరాకు 4 టన్నులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరాన్ని విత్తేటప్పుడు, పంట మోకాలు ఎత్తు పెరిగినప్పుడు.. 12 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

నీటి యాజమాన్యం : తేలిక నేలల్లో వారానికి ఒకసారి, నల్లరేగడి భూముల్లో 15 రోజులకొకసారి తడి ఇవ్వాలి. పంట పూత, గింజ పాలు పోసుకునే సమయంలో నీరు తప్పకపెట్టాలి.

అంతర పంటలు : జొన్న, కందిలను 2:1 నిష్పత్తిలో వేసుకోవచ్చు.

అంతరకృషి : విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వల్ల పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసేయాలి. విత్తిన తదుపరి కలుపు నివారణకు.. ఎకరాకు కిలో పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 3 రోజుల్లోపు పిచికారి చేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో 2, 4-డి ఎకరాకు 800 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్

కనకాంబరానికి పురుగుల బెడద



కనకాంబరంలో పురుగుల బెడద ఎక్కువని ఉద్యాన అధికారి ఎం.బబిత తెలిపారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు.

నులి పురుగులు: ఇవి మొక్కల వేర్లకు రంధ్రాలు చేసి బుడిపెలను కలుగజేస్తాయి. దీని వల్ల వేర్లు నీటిని, పోషకాలను కావాల్సిన మేర మొక్కకు అందించలేవు. అందువల్ల ఆకులు ముడుచుకుని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారతాయి. పూల పరిమాణం తగ్గుతుంది. నులి పురుగులు చేసిన రంధ్రాల గుండా శిలీంధ్రాలు వేర్లలోకి చేరి ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలు ఎండిపోతాయి.

నివారణ చర్యగా నులిపురుగులున్న పొలంలో కనకాంబరం పూలసాగు చేపట్టే ముందు, సూర్యరశ్మీకరణ చేయాలి. నాటేముందు ఎకరాకు 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగు కిలోల ఫోరేట్ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకతో కలిపి చల్లాలి. నులిపురుగులు సోకిన మొక్కల్ని పెరికి నాశనం చేయాలి. బంతి పూలతో పంటమార్పిడి చేస్తే నేలలో నులిపురుగుల సంఖ్య తగ్గుతుంది.

పిండినల్లి: లేత కొమ్మలు, ఆకులు, పూమొగ్గలపై తెల్లని పొర కప్పినట్టుగా ఉండే పురుగులు గుంపులుగా చేరి రసంపీల్చడంతో ఆకులు పసుపురంగుకు మారి మొక్కలు గిడసబారతాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని బూజు పెరుగుతుంది. దీని వల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ జరగక మొక్కల పెరుగుదల తగ్గుతుంది. నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపిన ద్రావణాన్ని రెండుసార్లు 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన నారు నాటడం లేదా సాగుచేసిన పొలంలో శిలీంధ్రాలు ఉండటం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఈ శిలీంధ్రానికి నులి పురుగులు తోడైనప్పుడు మొక్కలు తొందరగా ఎండిపోతాయి. ఆకులు ముందుగా కిందికి వాలుతాయి. తరువాత పసుపు రంగుకు మారి కొమ్మల చివర్లు కిందికి వంగుతాయి. మొదట వేర్ల చివర్ల వద్ద తర్వాత నేల మట్టం వద్ద కాండం కుళ్లిపోతుంది. దీన్ని కాండంకుళ్లు అంటారు. లీటరు నీటికి 3 గ్రా. కాంటాఫ్ కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ భూమి తడిచేలా పోసి ఎండు తెగులును నివారించవచ్చు.

రైలు స్వచ్ఛత పక్షోత్సవాలు ప్రారంభం

స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ప్రతిజ్ఞ



స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రైల్వేస్టేషన్ (శివనగర్), న్యూస్‌టుడే: వరంగల్ రైల్వే స్టేషన్‌లో బుధవారం స్వచ్ఛ రైలు పక్షోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెలా 31 వరకు నిర్వహించే కార్యక్రమాలను బుధవారం స్టేషన్ ఆవరణలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ డీఈఈ శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత ప్రమాణాలు పాటించడంపై వీధి నాటికను ప్రదర్శించి ఆలోచింపజేశారు. అనంతరం సీనియర్ డీఈఈ శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రయాణ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడంలో సహకరించాలన్నారు. ప్లాట్‌ఫాం, స్టేషన్ ఆవరణలో చెత్తవేయడం, వంటలు చేయడం, దుస్తులుతికి ఆరేయడం, ఉమ్మడం, బహిరంగ మూత్ర విసర్జన చేసినవారిని గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీని నిర్వహించారు. ఓవైపు స్వచ్ఛ రైలు పక్షోత్సవాలు జరుగుతుండగా మరోవైపు స్టేషన్‌లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై పారిశుద్ధ్య సిబ్బంది పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం కనిపించింది. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ ఏపీవో ఎస్ఆర్ హన్వ, కాజీపేట డీఎస్‌టీ జి.కుమరన్, వరంగల్ స్టేషన్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, ఎస్‌జీఈ వర్క్స్ సత్యనారాయణ, టెలికాం సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, నరేశ్, రామనాయక్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మీనా, డిప్యూటీ సీటీఐ మహేందర్, ఎలక్ట్రికల్ విభాగం దేవరాజ్, ఆర్పీఎఫ్ సీఐ నర్సింహ, ఎస్సై క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఒకటో నంబరు ప్లాట్‌ఫాంను శుభ్రం చేస్తున్న కార్మికులు

పోచమ్మకు బోనాల నీరాజనం



శంభునిపేటలో బోనాలతో వెళ్తున్న మహిళలు

శంభునిపేట (రంగశాయిపేట), న్యూస్‌టుడే: శంభునిపేట, ఏసీరెడ్డినగర్ ప్రాంతాల్లో పోచమ్మ బోనాలతో సందడి నెలకొంది. శ్రావణ మాసంలోని ఆఖరి బుధవారం కావడంతో శంభునిపేట బుడగ జంగాలకాలనీ వాసులు సామూహికంగా బోనాలతో తరలివచ్చారు. దూప, దీప నైవేద్యాలతో అలంకరించిన బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ యువకుల నృత్యాలతో భారీ ర్యాలీగా వెళ్లి పోచమ్మ ఆలయంలో సమర్పించారు. కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏసీరెడ్డి నగర్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో కదిలివెళ్లారు. 9వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి శ్రీలత మహిళలతో కలిసి బోనమెత్తారు. శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాల నడుమ ఉత్సాహంగా బోనాల పండుగను జరుపుకున్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



ఓసిటీలోని శ్రీసీతారామాంజనేయ దేవాలయంలో మహా రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

ఓసిటీ (కాశీబుగ్గ), న్యూస్‌టుడే: కాశీబుగ్గ ఓసిటీలోని శ్రీసీతారామాంజనేయ దేవాలయ ప్రాంగణంలో బుధవారం మహారుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ తౌటం భాస్కర్, అధ్యక్షురాలు మురహరి భాగ్యలక్ష్మి సారథ్యంలో 108 హోమగుండాలతో యజ్ఞం జరిపించారు. ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలను చేపట్టారు. మూల మంత్ర సహిత యజ్ఞం, విగ్రహాలకు ధన, ధాన్య, ఫల, పుష్ప, నవరత్న, సుగంధాది శయ్యాది వాసాలు, కలశస్థాపన నిర్వహించారు. అనంతరం భారీగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిందెల్లో పాలు మధురం..!

తరాలు మారినా మారని సంప్రదాయం

45 ఏళ్లగా తరలింపు



ఇత్తడి బిందెల్లో పాలు తెస్తున్న మహిళలు

శివనగర్, న్యూస్‌టుడే: పల్లె నుంచి నగరానికి పాల సరఫరా కొత్తేమి కాదు. అనాదిగా గ్రామీణ ప్రాంతాల నుంచి పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి తదితర పాల ఉత్పత్తులు పట్టణానికి వస్తున్నాయి. పాల సరఫరాలో ఆధునిక మార్పులెన్ని వచ్చినా ఇంకా పాతకాలం నాటి పద్ధతుల్లోనే కొందరు క్షీరాన్ని సరఫరా చేయడం విశేషం. వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం తిమ్మాపురం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు 45 సంవత్సరాలుగా నగరంలోని మిఠాయి దుకాణాలకు పాలను రోజూ సరఫరా చేస్తున్నారు. అది కూడా పాల డబ్బాలు.. క్యాన్లలో కాదు. ఇత్తడి బిందెల్లో. గ్రామానికి చెందిన బండి వారి కుటుంబానికి చెందిన ఐలమ్మ, కట్టమ్మ, కొమురమ్మ, భద్రమ్మ, వెంకటమ్మ, రాజమ్మ, రామమ్మ, ఎల్లమ్మ, దేవుడు కొమురయ్య రోజూ గ్రామం నుంచి ఇత్తడి బిందెల్లో పాలను తీసుకొని ఆటోల్లో నగరానికి వస్తున్నారు. వరంగల్ చౌరస్తా మూలన ఆటో దిగే వీరు నెత్తిన ఇత్తడి బిందెలను ఎత్తుకుని పాలతో నడుస్తూ వస్తుంటే నగరవాసులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇత్తడి బిందెలు దాదాపు కనుమరుగవుతున్న సమయంలో నగరంలోని ప్రధాన రోడ్డులో నెత్తిన బిందెలతో వస్తున్న వీరిని ఈ తరం వ్యక్తులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఇత్తడి బిందెల్లో పాలను ఇలా తరలిస్తే పాడవవని ఈ మహిళలు చెబుతున్నారు.

ఇలాగే అలవాటు..

- బండి భద్రమ్మ, తిమ్మాపురం



మా కుటుంబమంతా పాల వ్యాపారంపైనే బతుకుతున్నాం. పూర్వం నుంచి ఇత్తడి బిందెల్లోనే తెస్తున్నాం. ప్రతి రోజూ ఇలాగే తెస్తాం. అందరం కలిసి ఇంటి నుంచి ఆటోలో వస్తాం. వర్షం వచ్చినా, పిడుగులు పడినా ఉదయం 8.30 గంటలకు నగరానికి చేరుకుంటాం. మాకు దగ్గరలో పాల కేంద్రం ఉన్నా అక్కడ పాలు ఇవ్వం. మొదటి నుంచీ నగరంలోని మిఠాయి దుకాణాల వారే కొంటున్నారు. కాబట్టి వీరికి తప్ప మరెవరికీ విక్రయించడం లేదు.